



తొర్రేడు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

18 మండలాలకు జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారుల నియామకం

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖలో సంస్కర ణల్లో భాగంగా గ్రామ వార్డు సచివాలయాల నిర్వహ ణకు ప్రభుత్వం మండల జీఎస్‌డబ్లుఎస్ అధికారులను నియమించింది. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 18 మందిని డిప్యూటీ ఎం పీడీవో హోదాలో నియమించారు. ఈ మేరకు కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 12 మంది ప్రస్తుతం జిల్లా పరిధిలోనే ఉండగా పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఆరు గురు పని చేస్తున్నారు. వారంతా వెంటనే విధు ల్లో చేరవలసి ఉంది.ఆర్‌వీ సత్యనారాయణ (గోపాలపురం). ఎం.శ్రీనివాస్ (రంగంపేట). టి.గోపాలకృష్ణ (నిడదవోలు), కెఎస్‌వి వీరన్న (తాళ్లపూడి), కెవివి రాంబాబు(నల్లజర్ల), ఎస్.శ్యాంప్రసాద్ (కడియం), డి.ముత్యం (కొవ్వూరు), వి.శ్రీరామమూర్తి (గోకవరం), సిహెచ్.దేవదాసు (రాజానగరం), సిహెచ్ శ్రీశాస్త్రి (అనపర్తి), మల్లిడి వెంకటరెడ్డి(సీతానగరం), వై.మునేశ్వరరావు(బిక్కవోలు), గుణ్ణం ప్రసాదరావు (కోరుకొండ), కాయల వి.సత్యనారాయణ (దేవరపల్లి),దాసరి సూర్యనారాయణ (రాజమండ్రి రూరల్), పుల్లేటికుర్తి అచ్యుత రామకృష్ణ (చాగల్లు),కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(పెరవలి), టి.శేషుబాబు(ఉండ్రాజవరం)నియమితులయ్యారు.



ఏపీలోనూ కమలం వికసించాలి

ప్రశిక్షణ వర్గ్‌కు హాజరవుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ పురందేశ్వరి తదితరులు

ఏపీలోనూ కమలం పార్టీ బలోపేతానికి నాయకులు నడుం బిగించారు.. ఎక్కడికక్కడ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.. గురువారం రాజమహేంద్రవరం వేదికగా గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్సీ సోమ వీర్రాజు తదితరులు దిశా నిర్దేశం చేశారు.

4

చైల్డ్ ట్రాకింగ్ రిజిస్టర్ తప్పనిసరి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారి కోసం చైల్డ్ ట్రాకింగ్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. తొర్రేడులో గల అంగన్ వాడీ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. 0-3 ఏళ్ల పిల్లల ఇంటి సందర్శనలు నిరంతరం చేయాలని తల్లిదండ్రులకు పోషకాహారం, శిశు వికాసం హెచ్చరిక సంకేతాలు, తక్షణ వైద్య సహాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి హెల్త్ కార్డులో ఇమ్యునైజేషన్, ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల్లో వైద్యుల నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా సందర్శనలు జరగాల న్నారు. ఏఎన్ఎంలు హెల్త్ విజిటర్లు, అంగన్‌వాడీ కార్మికుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సూచించారు.

వచ్చే నెల 4 నుంచి స్కూల్ బస్‌ల తనిఖీ

జిల్లా రవాణా అధికారి సురేష్



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి డిసెంబరు 4వ తేదీ వరకూ స్కూల్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు తనిఖీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రత్యేక బృందాలు ఉదయం, సాయంత్రం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తాయని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో 2 వేలకు పైగా బస్సులు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. నిబంధనల మేరకు తనిఖీలు చేస్తామన్నారు.

కొత్తగా 217 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,581 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 217 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ గురువారం 2026 ఎస్ఐఆర్ సన్నాహక కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో మొత్తం 16,23,741 ఓటర్లలో 4,19,204 మందిని బీఎల్‌వో యాప్ ద్వారా మ్యాప్ చేశామన్నారు. కొత్తగా 12,696 మంది వివరాలు బీఎల్‌వోలు నమోదు చేశారన్నారు.జిల్లాలో హేతుబద్ధీకరణ తర్వాత అనపర్తిలో 248, రాజానగరం 238, రాజమహేంద్రవరం నగరం 263, గ్రామీణం 309, కొవ్వూరు 212, నిడదవోలు 248, గోపాలపురం నియోజకవర్గంలో 280కి పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగిందన్నారు. ఓటరు ఐడీ కార్డులు జిల్లాకు 14,123 వచ్చాయన్నారు.12,762 కార్డులను పోస్ట్ ద్వారా పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ మేఘ స్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 30 వరకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ రాజమహేంద్రవరం సంచాలకులు బి.శశాంక శుక్రవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. ఆసక్తి కలిగి అర్హత ఉన్న అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్‌లో నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్ కోటా ప్రకారం బీసీ 66 శాతం, ఎస్సీ 20 శాతం, ఎస్టీ 14 శాతం ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైతే విజయవాడ గొల్లపూడిలో ఉన్న బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తా రన్నారు. వివరాలకు 94944 52267, 9000 058102 నెంబర్లలో సంప్రదించాలన్నారు

ఇద్దరు ఖైదీలకు క్షమాభిక్ష

సెంట్రల్ జైలు నుంచి విడుదల

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు జీవిత ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. దీంతో గురువారం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మాధిరి సువర్ణరాజుకు హత్య కేసులో 2010లో కోర్టు జీవిత ఖైదు విధించింది. 2016లో హైకోర్టు అప్పీలును తిరస్కరించింది. 2018లో సుప్రీం కోర్టు శిక్షను ఖరారు చేసింది. బిక్కవోలు మండలం కొమరిపాలెంకు చెందిన కటికిరెడ్డి నాగేశ్వరరావుకు హత్య కేసులో కోర్టు 2011లో జీవితఖైదు విధించింది.2018లో హైకోర్టు అప్పీలును తిరస్కరించగా సుప్రీం కోర్టులో అప్పీలు పెండింగ్‌లో ఉంది. ఇతను శిక్షా కాలంలో పరోల్, పర్లో ఉపయోగించుకోలేదు. వీళ్లిద్దరూ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ నెం.165 ద్వారా స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు.

మూడు కాదు.. నాలుగు!



నాలుగు జిల్లాలతో ఉమ్మడి తూర్పుగోదావరి

అడిగింది లేదనలేదు.. కోరింది కాదనలేదు.. ఆశలు ఫలించాయి.. ఆకాంక్షలు నెరవేరాయి.. గత వైసీపీ చేసిన తప్పులను సరిదిద్దుతూ సరికొత్త బాటలు వేశారు.. కొత్త సరిహద్దులు నిర్ణయించారు.. గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఎక్కడో 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది..దీంతో ఇబ్బందులకు గురయ్యేవారు.. ఇది గమనించిన చంద్రబాబు ఏజెన్సీ వాసులకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.. ఈ మేరకు రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు.. ఇప్పటి వరకూ తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలు మాత్రమే ఉండేవి. నాలుగో జిల్లాగా పోలవరం చేరింది. పెద్దాపురం నియోజకవర్గంలో ఉన్న సామర్లకోట కాకినాడ డివిజన్‌లో ఉండేది.. డివిజన్ కేంద్రం మార్చాలని ఏనాటి నుంచో విన్నపాలు చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వం సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో చేర్చింది. మండపేట నియోజకవర్గం కోనసీమ జిల్లాలో ఉండేది. ఈ నియోజక వర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేశారు. ఈ మార్పులు..చేర్పులపై 30 రోజుల్లో అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

- కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు
- జిల్లా కేంద్రంగా రంపచోడవరం
- తూర్పులో చేరిన మండపేట
- పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట
- నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కారు
- 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఇక పెద్దాపురంలోనే సామర్లకోట

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలాన్ని ఇక నుంచి పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవోఆర్‌టీ 1493 పేరిట గురువారం రాత్రి జిల్లా కేంద్రానికి, పెద్దాపురం, కాకినాడ ఆర్డీవో కార్యాలయాలకు ఉత్తర్వులు చేరాయి. మొదటి సార్వత్రిక ఎన్నికల నాడే పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం,సామర్లకోట మండలాలు చేర్చినా పరిపాలనాపరమైన కార్యకలాపాలను మాత్రం పెద్దాపురం మండలం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయ పరిధి, సామర్లకోట మండలం కాకినాడ ఆర్డీవో పరిధిలోను కేటాయించారు. ఎన్నికల నిర్వహణ మాత్రమే పెద్దాపురం ఆర్డీవో పరిధిలో పర్యవేక్షించేవారు.ఒకే నియోజకవర్గం మొత్తం మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇక నుంచి సామర్లకోట మండల కార్యకలాపాలు పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోకి అనుసంధానం కానున్నాయి.

నాలుగోది గిరిజన జిల్లా

రంపచోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం మూడు కాదు.. నాలుగు జిల్లాలు. సీఎం చంద్రబాబు ఆమోదంతో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం జీవో నెం 1492తో గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రంపచోడవరం డివిజన్ పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గుర్తేడు, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి మండలాలు.. చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలను కలిపి ఈ కొత్త గిరిజన జిల్లాగా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాల ఏర్పాటు చట్టంలోని నిబంధనల మేరకు ప్రాథమిక ప్రకటనను జారీ చేసే అధికారాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్‌కు కట్టబెడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గురువారం నుంచి 30 రోజుల వ్యవధిలో ఈ ప్రతిపాదిత జిల్లా ఏర్పాటు విషయంలో తమకు ఉన్న అభ్యంతరాలు, మెరుగైన సూచనలను అల్లూరి జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా తెలియపరచవచ్చు. గడువు ముగిసిన అనంతరం ప్రభుత్వం ఈ కొత్త జిల్లా ఏర్పాటును గెజిట్ రూపంలో ప్రకటించడం ఇక లాంఛనమే. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రంపచోడవరం, చిం తూరు డివిజన్‌లోని ప్రజలకు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇంతవరకూ ఉన్న వందలాది కిలోమీటర్ల భారం తగ్గుతోంది.

పోలవరం లేని జిల్లా

పోలవరం పేరుతో ప్రకటించిన ఈ జిల్లాలో పోలవరం ప్రాంతానికి చోటే లేదు. ఈ జిల్లాకు పోలవరం అనే పేరు ప్రభుత్వం ఎందుకు పెట్టిందన్నది చర్చనీయాంశంగా మారింది. 30 రోజుల గడువు అనంతరం ఈ జిల్లా పరిధిలో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ కొత్త జిల్లా పరిధిలోనే పోలవరం ముంపు మండలాలు పూర్తిగా రెండు, పాక్షికంగా మూడు ఉండడం గమనార్హం. పోలవరం ప్రాజెక్టు కింద రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల పరిధి లోని ఉన్న ముంపు గ్రామాల గిరిజన నిర్వాసితులందరికీ కొత్త జిల్లా పరిధిలోనే పునరావాసం కల్పించే యోచన కూడా ప్రభుత్వానికి ఉందని తెలుస్తోంది.

తూర్పున..మండపేట

రాజమహేంద్రవరం/మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ఉండే మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేస్తూ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు డిసెంబరు 31 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ప్రజలు జిల్లా కేంద్రం అమలాపురం వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. నియోజకవర్గం అంతా ఏకతాటిపై నిలబడి తూర్పులో విలీనం చేయాలని పోరాడారు. 2008 వరకు ఆలమూరు నియోజకవర్గం రాజమహేంద్రవరం పార్లమెంట్‌లోనే ఉండేది. 2009లో నియోజకవర్గ పునర్విభజన సమయంలో ఆలమూరు నుంచి విడిపోయి మండపేట నియోజకవర్గం ఏర్పడింది. అప్పుడు ఆలమూరు కొత్తపేట నియోజకవర్గంలో కలవగా మండపేట నియోజకవర్గంలో అనపర్తి నియోజకవర్గం పరిధిలోని రాయవరం మండలం ఇక్కడ కలిసింది. 2009లో ఏర్పడిన మండపేట నియోజకవర్గం 16 ఏళ్ల తర్వాత తిరిగి ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో చేరింది. మండపేట నియోజకవర్గంలో మూడు మండలాలతో పాటు ఒక మునిసిపాలిటీ ఉంది. 42 పంచాయతీలు ఉన్నాయి. మండపేట మునిసిపాలిటీ, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ జనాభా 3.45 లక్షలు ఉండగా ఓటర్లు 2.20 లక్షలు మేర ఉన్నారు. జిల్లాలో 21 మండలాలు ఉంటాయి.రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు మండపేట, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు,జిల్లా అర్బన్, గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి.



వజ్రోత్సవ వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు నిమ్మల, కందుల దుర్గేష్

చరిత్రకు నిదర్శనం వజ్రోత్సవం

నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆనాడు ఎంతో చారిత్రాత్మకమైన ప్రాంతం.. జల రవాణాకు ముఖ్యకేంద్రం.. పశ్చిమ డెల్టాకు ముఖద్వారం అయిన నిడదవోలు పట్టణం 60 వసంతాలు పూర్తి చేసుకుని చరిత్ర చాటిచెప్పే విధంగా వజ్రోత్సవ వేడుకలు చేసుకోవడం అభినందనీయమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నిడదవోలులోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద గురువారం రాత్రి నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు హాజరై మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల సహకారంతో కూట మి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు.నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కావడం గోదావరి జిల్లాలు చేసుకున్న అదృష్టమన్నారు. పట్టణ ప్రజానీకానికి జల జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన గోదావరి జలాలను తాగునీరుగా అందిస్తామన్నారు. 2014 రాష్ట్ర విభజనలో మనకు జరిగిన నష్టం కంటే 2019లో వైసీపీ ప్రభుత్వం చేసిన నష్టమే ఎక్కువ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పు చేసి వెళ్లిపోయిందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా కూటమి ప్రభుత్వం అత్యధిక నగదు సామాజిక పింఛన్లుగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి దుర్గేష్, చైర్మన్ భూపతి ఆదినారా యణ,శశి విద్యాసంస్థల అధినేత బూరుగు పల్లి వేణు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా : రోడ్ కం రైలు వంతెన ఫుట్‌పాత్‌పై పిచ్చిమొక్కలు

పేరు గొప్ప.. వంతెన దిబ్బ!

శిథిలావస్థకు చేరిన రోడ్ కం రైలు వంతెన

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేరులో ప్రత్యేకం.. నిర్వహణలో నిర్లక్ష్యం ఏమిటనుకుంటున్నారా. అదేనండి రాజమహేంద్రవరం, కొవ్వూరు నగరాలను కలుపుతూ గోదావరిపై నిర్మించిన రోడ్డు కం రైలు బ్రిడ్జి. ఈ వంతెన తెలియని వారుండరు. ఎందుకంటే ఆసియాలోనే అతి పెద్ద రెండో ఆర్‌సీఆర్‌బి వంతెన. ఇంత ప్రత్యేకత ఉన్నా నిర్వహణలో అడుగడుగునా అలక్ష్యం కనిపిస్తూనే ఉంది. ఎంతలా అంటే వంతెనపై ఫుట్‌పాత్, ఇరువైపులా ఉన్న రైలింగ్ ఊడి గోదావరిలోకి ఒరిగిపోతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. వంతెన జిల్లా కేంద్రంలోనే ఉన్నా ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన రక్షణకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. బ్రిడ్జి నిర్మించిన తరువాత 18 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బందీ లేదు. ఆ తరువాత నుంచి ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో వంతెన మరమ్మతులకు గురవుతూనే ఉంది. ప్రతిసారి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అధికారులు ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జిని మూసివేసి రాజమహేంద్రవరం వైపు కొంత రైలింగ్ పనులు చేపట్టి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం ఎవరైనా గోదావరి అందాలను తిలకించడానికి ఫుట్‌పాత్ ఎక్కితే రైలింగ్‌తో సహా గోదావరిలో పడిపోయే అంత ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల కొంతమంది అధికారులు కొంత కాలం తరువాత బ్రిడ్జిపై రాకపోకలు కష్టమేనని చెప్పుకోవడం గమనార్హం. పాలకులు వంతెన విషయంలో ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే బ్రిడ్జి పూర్తిగా మూతపడే అవకాశాలున్నాయి. పాలకులారా ఇకనైనా మేల్కొండి. 2027లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. ఆ సమయానికి అయినా బ్రిడ్జికి శాశ్వత మరమ్మతులు చేపట్టి.. సేవలందించేలా చర్యలు తీసుకోవాలని గోదావరి జిల్లాలవాసులు కోరుతున్నారు.





చూస్తే.. పడతాం : రోడ్ కం రైలు వంతెనపై శిథిలావస్థలో రెయిలింగ్



చివరికి.. పరుగో..పరుగు!

తుఫాన్ హెచ్చరికలతో రైతాంగం ఆందోళన

రాజమహేంద్రవరం/అనపర్తి/దేవరపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మళ్లీ అన్నదాతలు ఉరుకులు..పరుగులు పెడుతున్నారు.. చేతికొచ్చిన పంట ఎక్కడ నోటికందకుండా పోతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో తుఫాన్ వస్తుందనే హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో రైతులంతా నిమగ్నమయ్యారు. పంటను కాపాడుకునేందుకు ఉరుకులు.. పరుగులు పెడుతున్నారు.ఒకట్రెండు రోజుల్లో భారీ వర్షాలు రానున్నట్టు వాతావరణ కేంద్రం హెచ్చరికతో రైతులు తమ ధాన్యాన్ని త్వరగా చక్కబెట్టుకుంటున్నారు.కానీ ఇంకా 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాలు,ఖాళీ స్థలాల్లోనూ ఉంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉండకూడదనే నిబంధన వల్ల రైతులు తమ ధాన్యాన్ని వెంటనే అమ్ముకోలేని పరిస్థితి ఉంది. జిల్లాలో 76,941 హెక్టార్లలో వరి సాగు చేయగా ఇప్పటి వరకూ 47,018 హెక్టార్లలో మాసూళ్లు జరిగింది.ఇది 65 శాతం. దీని ద్వారా 2.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇందులో ప్రభుత్వం ఒక లక్షా 70 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కె ట్‌లో 35 వేల మెట్రిక్ టన్నులు విక్రయించారు. 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు సొంత అవసరాలకు ఉంచుకున్నారు. ప్రస్తుతం కళ్లాల్లో 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్టు అంచనా. ఇప్పటి వరకూ రైతులకు రూ.172 కోట్లు చెల్లించారు.గత తుఫాన్‌లో పూర్తిగా నేలకొరిగిన పంటను కోత మిషన్‌తో కోసే వీల్లేకపోవడంతో 15 శాతం పంట పొలాల్లోనే రైతులు కుప్పలు వేసుకున్నారు. ప్రస్తుత తుఫాన్ పరిస్థితిని బట్టి నూర్పులు చేసే విధంగా రైతులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. రైతులు ఆగమేఘాల మీద ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కోతలకు కోసి ఆరబెట్టి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నారు. తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా అందరూ తమ పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. అనపర్తి మండలంలో 9 వేల ఎకరాల్లో వరి సాగుచేయగా 95 శాతం కోతలు పూర్తయ్యాయి. మిగిలిన ఐదు శాతం పంటను కోయాల్సి ఉంది. దేవరపల్లి మండలంలో 9500 ఎకరాల్లో వరి సాగు చేయగా 5 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి.కళ్లాల్లో 5 వేల టన్నుల ధాన్యం ఉంది.ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు.


కరప మండలం పెద్దాపురప్పాడులో నాటిన జామ మొక్క

చిన్నారులకు విద్యాబుద్ధులే కాదు... విలువలతో కూడిన అంశాలపైనా అవగాహన కల్పించాలి. చిన్నప్పటి నుంచే సమాజంపై అవగాహన తీసుకురావాలి. అందుకు తగ్గట్టుగానే అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. మాతాశిశు రక్షణ కోసం ఏర్పాటుచేసిన ఇవి నేడు చిన్నారులకు పాఠాలు నేర్పించడంతో పోషక విలువలు సమృద్ధిగా ఉండే ఆహారం అందిస్తున్నాయి.


కాకినాడ రూరల్ మండలం తూరంగిలో అరటి చెట్టు

అద్భుత ఫలాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వాటికలు

» ఆకుకూరలు, పండ్ల తోటల పెంపకం » వాటితోనే బాలింతలు, గర్భిణులకు పోషకాహారం తయారీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో 1,886 అంగన్వాడీ స్కూళ్లు ఉన్నాయి. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నారు. వారి ఆరోగ్య సంరక్షణకు అనేక చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఇవి అంగన్వాడీ ఆరోగ్య రక్షణ కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో పోషకాహారం కలిగే ఉండే ఆకుకూరలు, కూరగాయల సాగు చేపడుతున్నారు. పండ్ల మొక్కలను పెంచుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతూ ఇందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. 488 కేంద్రాల్లో ఈ తరహా పోషణ వాటికలు ఏర్పాటు చేశారు.



అంగన్వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు పోషకాలు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలతో వండిన మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఇటీవల వ్యవసాయంలో రసాయనాల వాడకం పెరిగిపోవడంతో ఆకుకూరలు, కూరగాయలు విషతుల్యమవుతున్నాయి. ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో పలు రాకల ఆకుకూరలు, కూరగాయలను సేంద్రియ విధానంలో సాగు చేసే చర్యలు చేపట్టారు. తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకుకూరలతో పాటు అరటి, బెండకాయ, వంకాయ, టమాటా పండిస్తున్నారు. ఖాళీ స్థలం ఉన్న చోట అరటి, దానిమ్మ, జామ వంటి పండ్ల మొక్కలు వేశారు. అవి ఫలాలు అందిస్తున్నాయి. స్థలాలు అనువుగా ఉన్న కేంద్రాల్లో తొలి విడత ఏర్పాటు చేసిన పోషణ వాటికలు సత్ఫలితాలు అందిస్తున్నాయి. ఈ ఉత్పత్తులను గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేయనున్నారు. విటమిన్లు అందించే పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలున్న మొక్కలూ పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు.



కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని అంగన్వాడీ కేంద్రంలో పండిస్తున్న గోంగూర, గోరుచిక్కుడు కాయలు


అంగన్వాడీ కేంద్రం ఆవరణలో పండిన పండ్లతో చిన్నారులు

సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆకాశ తేజసుడు

ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శివుడు మాదిరిగానే సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆకాశ తేజసుడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఆలవెల్లి మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన సంతాన శయన మందిరాన్ని ఆయన గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివ తేజస్సు వలనే బంగారం, వెండి ఇతర లోహాలు పుట్టుకొచ్చాయని, సుబ్రహ్మణ్యేశ్వరుని ఉత్పత్తి సమయంలో ఇది జరిగిందని తెలిపారు. స్వామికి పూజ చేయడమంటే భూమి అంతటికీ పూజ చేయడమేనని చెప్పారు. భూమి శాప విముక్తి కోసమే సుబ్రహ్మణ్యేశ్వరుడు జన్మించాడని తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు పంచభూత స్వరూపడని, అగ్ని నుంచి పుట్టాడు కాబట్టి అగ్ని స్వరూపడయ్యాడని చెప్పారు. దీపాన్ని వెలిగించడం, హారతి ఇవ్వడం ఆయనకు అత్యంత ప్రీతికరమన్నారు. అనంతరం చాగంటి దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కడిమిశెట్టి కుమార భాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆత్కూరి దక్షిణామూర్తి, కార్యదర్శి కడిమిశెట్టి విజయభాస్కరరెడ్డి, సంయుక్త కార్యదర్శి అబ్బిరెడ్డి అప్పారావు, కోశాధికారి ఆకొండి విశ్వనాథం, సభ్యులు కడిమిశెట్టి వెంకటరావు, అరిగెల రామయ్యదొర, పాలపర్తి చలమయ్య, రాయవరపు ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న కోటేశ్వరరావు, సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



'పాడా' ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి బదిలీ



పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ (పాడా) ప్రాజెక్టు డైరెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.చైత్రవర్షిణి బదిలీ అయ్యారు. ఆమెను గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు కార్యాలయంలోని మైక్రో క్రెడిట్ విభాగం స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణం రిలీవ్ చేయాలని సూచించారు. పాడా తొలి రెగ్యులర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆమె వ్యవహరించారు. ఆరోగ్య కారణాలతో ఇటీవల పలుమార్లు సెలవుపై వెళ్లారు. ఆరోగ్య కారణాల రీత్యా తనను బదిలీ చేయాలని ఆమె చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఎవరినీ నియమించలేదు.



లక్ష్మీగౌతమ్, తమన్‌లను అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

బీసీసీఐ విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీ... ఏపీ క్రికెట్ జట్టుకు 'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

కాకినాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీ కోసం ఏపీ క్రికెట్ జట్టుకు శ్రీప్రకాష్ సినర్జీ స్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 11వ తరగతి విద్యార్థి జి.లక్ష్మీగౌతమ్, 10వ తరగతి విద్యార్థి కె.తమన్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు తమ విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో పాటు కోచ్ జి.దుర్గాప్రసాద్‌ను ఏపీ క్రికెట్ సంఘ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, విజయ్‌ప్రకాష్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు తలాటం హరీష్, కార్యదర్శి నక్కా వెంకటేష్, సంయుక్త కార్యదర్శి సమీరా మెమెంటోలతో సత్కరించి అభినందించారు.

నేటి నుంచి దత్త జయంతి

సప్తాహ మహోత్సవాలు


పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతి

మహా సంస్థానంలో వచ్చే నెల 4 వరకు ప్రత్యేక పూజలు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శుక్రవారం నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 4వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక పూజలు, స్వాములకు విశేష అలంకారాలు చేస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలిరానున్న దృష్ట్యా ఆలయాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ మహా గణపతి పూజ, కలశస్థాపన, శత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, మూలమంత్ర అనుష్టానం, శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం 4 గంటలకు అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్ర హోమం, 5 గంటలకు హారతులు, పల్లకీ సేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుపుతారు. అలాగే ప్రతిరోజూ గోపూజ, అభిషేకం, రుద్రాభిషేకం, దత్త హోమం, వెండి పల్లకీ సేవ, దత్త జయంతి రోజున ఊయల సేవ జరుగుతాయి.

రోజువారీ పూజలు.. శుక్రవారం దత్తాత్రేయ స్వామికి గ్రామోత్సవం, సర్వపుష్పపూజ, 29న లక్ష బిల్వార్చన, 30న సహస్ర చామంతి పూజ, డిసెంబరు 1న లక్ష తులసి అర్చన, 2న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 3న గులాబి అర్చన, సంపెంగ పుష్ప పూజ, 4న పూలంగి సేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్త జయంతి రోజు సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, పశ్చిమ బెంగాల్, ఒడిశాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు.

పాదగయ క్షేత్రంలో ఇలా..

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్త జయంతి సప్తాహ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. వేదోక్త విధిననుసరించి దత్తాత్రేయ మంత్రానుష్టానము, హోమాలు, గురుచరిత్ర, వేద పారాయణా, యతిపూజ, లక్ష బిల్వార్చన, సత్యదత్త వ్రతాదులచే సప్తాహ దీక్షతో ఉత్సవాలు నిర్వహిస్తారు. డిసెంబరు 4 వరకు జరిగే ఉత్సవాల సమయంలో ప్రతిరోజూ మహా గణపతి పూజ, ఋత్విక్ వరణలు, ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, శీర్ష ఉపనిషత్, వేదసూక్తాలు, మూలమంత్రాలు, దత్త మూలమంత్రం, జపాలు, సామూహిక గురుచరిత్ర పారాయణ జరుగుతాయి. మధ్యాహ్నం దత్తమూల మంత్రహోమాలు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన నిర్వహిస్తారు. తొలి రోజైన శుక్రవారం సహస్ర కలువ పుష్పార్చన, 29న సహస్ర తామర పుష్పార్చన, 30న లక్ష బిల్వార్చన, డిసెంబరు 1వ తేదీన సహస్ర గులాబీ అర్చన, 2న సహస్ర చామంతి పుష్పార్చన, 3న లక్ష తులసి అర్చన 4న సర్వపుష్పార్చన, సాయంత్రం దత్తాత్రేయుడికి ఊయల సేవ జరుగుతాయి.

అన్ని సౌకర్యాలు కల్పించాం

పాదగయ క్షేత్రంలో జరిగే దత్త జయంతి సప్తాహ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులు, దత్తమాలధారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. వారం పాటు ప్రత్యేక పూజలు, దత్త జయంతి రోజున విశేష కార్యక్రమాలు జరుగుతాయి.

-కాట్నం జగన్మోహన శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి, పాదగయ క్షేత్రం.


పిఠాపురం పాదగయ క్షేత్రంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామి

3న ఇరుముడి ధారణ

దత్తమాల ధరించి మండల, అర్ధ మండల, సప్తాహ దీక్ష చేసిన భక్తులకు డిసెంబరు 3న ఇరుముడి ధారణ, దత్తస్వాముల నగరోత్సవం నిర్వహిస్తారు. 4వ తేదీ తెల్లవారుజామున దత్త దీక్ష విరమణ, ఇరుముడి సమర్పణ, మహా పూర్ణాహుతి, మహాపూజ జరుగుతాయి.

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

దత్త జయంతి మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశాం. సులభతరంగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తాం.

-ఆర్.సౌజన్య, కార్యనిర్వహణాధికారి, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక


ఉమ్మడి జిల్లా ఖోఖో అండర్-14 జట్టుతో ఎంఈవో సత్యరంగారావు

సర్పవరం జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14 ఖోఖో జట్టు ఎంపికను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఖోఖో అండర్-14 తుది జట్టు 12 మంది సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 23 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లా, ఏఎస్ఆర్ జిల్లాల పరిధిలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో రాణించిన 12 మంది సభ్యులను ఖోఖో తుది జట్టుగా ఎంపిక చేసినట్టు ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టు సభ్యులకు స్పోర్ట్స్ టీషర్ట్‌లను అందించారు. విశాఖలో ఈ నెల 28 నుంచి 30వరకు జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన జట్టు సభ్యులను ఇన్‌చార్జి హెచ్ఎం మూర్తి అభినందించారు.కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పీఈటీలు హరిబాబు, త్రిమూర్తులు, కిరణ్‌కుమార్, సుప్రియ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం చిత్తశుద్ధితో ఉంది

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వంతో చిత్తశుద్ధితో ఉందని భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. అయినా పదేపదే తమ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ, విమర్శిస్తూనే ఉంటే అలాంటి వారి చిత్తశుద్ధిని తాము అనుమానించాల్సి ఉంటుందన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్లో బీజేపీ గోదావరి జోన్ మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ తరగతులకు ఆయన విచ్చేసి మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం రూ.11,500 కోట్ల ప్యాకేజీ మంజూరు చేయడమే తమ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను సీఎం చంద్రబాబు.. కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లకు చెప్పడం ద్వారా ప్యాకేజీ సాధించామని పేర్కొన్నారు.

కన్నుల పండువగా సుబ్రహ్మణ్యుడి రథోత్సవం


శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం

బిక్కవోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాల్లో రెండో రోజైన గురువారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.17 గంటలకు స్వామి వారిని మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ రథంలో వుంచారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథం లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు నిర్వహించిన కోలాటాలు, బ్యాండు మేళాలు, కేరళ వాయిద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి ఆలయం నుంచి వంగా వారి వీధి మీదుగా బిక్కవోలు మెయిన్‌రోడ్, రాజారావుపేట రోడ్ వరకూ వెళ్లి ఆలయం వద్దకు చేరింది. ఉత్సవ కమిటీ సభ్యులు పాలచర్ల శివ ప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, పల్లి రాజారెడ్డి, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్ చౌదరి, త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీను పాల్గొన్నారు. డీఎస్పీ విద్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పుల కనువిందు..

షష్ఠి మహోత్సవం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి కాల్చిన బాణసంచా వీక్షకులను కనువిందు చేసింది. గ్రామానికి చెందిన గోలింగేశ్వర ఫైర్ వర్క్స్, కనకదుర్గ హుస్సేనియా ఫైర్ వర్క్స్ వారు పోటా పోటీగా బాణసంచాను స్థానిక హైస్కూలు గ్రౌండులో కాల్చారు. ఈ సందర్భంగా ఆకాశంలో వెలుగులు వెదజల్లే బ్యాటరీ బాక్సులు, నిప్పులు చెలరేగే సర్పాలు, ఈతచెట్లు, మల్లెపందిరిలు, సెర్చిలైట్లు, విష్ణు, సూర్య చక్రాలు, అందర్నీ ఆకట్టుకున్నాయి.


బాణసంచా కాల్పులో నిప్పులు గక్కుతున్న సర్పం

బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతం

పార్టీ గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


బీజేపీ గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్రాధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ ఆధారంగా రాష్ట్రంలో బీజేపీని పటిష్ఠం చేయడంతోపాటు కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో జరిగిన బీజేపీ గోదావరి జోన్ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ వర్గ్‌లో ఆయన మాట్లాడుతూ కలిసి పని చేయడానికి ఈ శిక్షణా తరగతులు ప్రేరణగా నిలుస్తాయి అన్నారు. మండల నాయకులు పార్టీ తరపున క్రియాశీలకంగా వ్యవహరించాలని, కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అన్నారు. వాడ వాడలా పార్టీ పతాకాలు ఎగరాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ప్రశిక్షణ వర్గ్ నిర్వహించుకోవడం ద్వారా నాయకుల్లో నిబద్ధత, నాయకత్వం పెరుగుతుందని అన్నారు. జాతీయపార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేస్తున్నామనే సంగతి తెలుసుకోవాలని సూచించారు. సొంతంగా 16 రాష్ట్రాల్లో, మిత్ర పక్షాలతో కలసి ఐదు రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్నామనే సంగతి మరచిపోకూడదని, కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక అంశాల ఆధారంగా పనిచేయాలని ఆయన సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో ఎలా కలసి పనిచేయాలనేదానిపై కార్యాచరణకు అనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఉదయం స్థానిక గౌతమిఘాట్ వద్ద ఎమ్మెల్సీ సోము వీర్రాజు, యోగా సాధకులతో కలిసి కలసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన జీవనశైలిలో ఒక భాగమని, మన పూర్వీకులు మనకు అందించిన ఒక వైద్య విధానమని పేర్కొన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, బొమ్ముల దత్తు, నిర్మలా కిషోర్, లక్ష్మీ ప్రసన్న, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత నీటిజీవనం!

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

రంపచోడవరం దగ్గరలో భారీ నీటి ప్రాజెక్ట్ భూపతిపాలెం రిజర్వాయర్ ఉంది. ఇక్కడ ఎంతోమంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. సువిశాల, ప్రశాంతమైన ఈ ప్రాంతంలో ఓ మత్స్యకార కుటుంబం చేపలు పడుతుండగా 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించింది.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో దమ్ము చేస్తున్న పంటపొలాల్లో కొంగలు ఇలా గుంపుగా సందడి చేశాయి.

కొంగలు గుంపు.. కనులకు ఇంపు

–మండపేట (ఆంధ్రజ్యోతి)

డొంకరాయిలో సినీ సందడి

సినీ నటుడు రవితేజపై సన్నివేశాల చిత్రీకరణ



మార్కెట్ సెంటర్లో సినీనటుడు రవితేజ

మోతుగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతూరు జిల్లా వై. రామవరం మండలం డొంకరాయి గ్రామంలో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. సినీ నటుడు రవితేజ హీరోగా నటిస్తున్న నూతన చిత్రానికి సంబంధించిన డొంకరాయి మార్కెట్ సెంటర్లో జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణ క్రీడామైదానంలో షూటింగ్ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సన్నివేశాలు చిత్రీకరించారు. రవితేజను చూడడానికి అధికంగా అభిమానులు తరలివచ్చారు. మైత్రీ మూవీస్ మేకర్స్ బ్యానర్‌పై దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్ కాగా.. సాయి కుమార్, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నెలరోజుల పాటు మొదటి షెడ్యూల్ ఈ ప్రాంతాల్లో చిత్రీకరించడానికి రెండో షెడ్యూల్‌ను జనవరి నుంచి నిర్వహించడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తుంది.

అంతర్వేదిలో సినీనటుల పూజలు

అంతర్వేది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సినీనటులు రాజీవ్‌కనకాల, బెల్లంకొండ ప్రవీణ్, జబర్దస్త్ అశోక్ విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం చేసుకున్న వారికి వేద పండితులు మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం సినీ నటులతో భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్, బెల్లంకొండ సూరిబాబు పాల్గొన్నారు.



ఆలయంలో నటులు రాజీవ్‌కనకాల, ప్రవీణ్, అశోక్

శ్రీ పుష్పయాగం... భక్తజన తన్మయత్వం..

అన్నవరంలో ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు





పూజలు చేస్తున్న పండితులు.. ఊగుటూయలలో స్వామి,అమ్మవార్లు



అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణోత్సవాలు గురువారం రాత్రి జరిగిన శ్రీపుష్పయోగ మహోత్సవంతో ముగిశాయి. రాత్రి 8గంటలకు నవదంపతులైన స్వామి,అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులు గావించి అర్చకస్వాములు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించి స్వామి, అమ్మవార్ల అష్టోత్తర శతనామాలతో పుష్పార్చన గావించారు. అనంతరం సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఊగుటూయలలో నవదంపతులను ఉంచి విశేష పదార్థాలను, పలురకాలైన పండ్లను ఉంచి నివేదన గావించి వధూవరులకు ఏకాంత సేవ నిర్వహించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు, కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీతాంబూలాలు అందజేశారు. కార్యక్రమం తిలకించేందుకు అధికసంఖ్యలో మహిళాభక్తులు విచ్చేయగా వారికి రవికవస్త్రం అందించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించగా ఆలయకమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



ఈదరాడలో స్థానికుల చేతిలో హతమైన రక్తపింజరి పాము

7 అడుగుల రక్త పింజరి హతం

మామిడికుదురు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ గుర్రాలబీడు ప్రాంతంలో గురువారం 7 అడుగుల పొడవున్న రక్తపింజరి పామును స్థానికులు కొట్టి చంపారు. 3రోజుల వ్యవధిలో రెండు పాములను హతమార్చామని, ఇటీవల వీటి సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎక్కడో కొండ ప్రాంతాల్లో ఉండే ఈ పాములు సుదూర ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించే కంకరతో గ్రామాల్లోకి వచ్చి పదుల సంఖ్యలో పిల్లల్ని పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొంటున్నారు.

రిజర్వేషన్ల శాతం మరింత పెంచాలి

బీసీ ప్రతినిధుల పిలుపు

యానాంలో ఏపీ బీసీ ఫెడరేషన్ సమావేశం



సమావేశం పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

యానాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల శాతాన్ని మరింత పెంచాలని, వెనుకబడిన సామాజికవర్గాలంతా ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేయాలని బీసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. యానాం కామిశెట్టివారివీధిలోని గీతా మందిరంలో ఆంధ్రపదేశ్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీసీ సంఘనేత, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ ప్రతినిధులు రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ జేఏసీ ప్రతినిధి డాక్టర్ విశారదన్ మహారాజ్ (తెలంగాణ), కుడిపూడి సూర్యనారాయణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, పితాని బాలకృష్ణ, ఉభయగోదావరి జిల్లాలకు ముఖ్య బీసీ నాయకులు హాజరయ్యారు. మల్లాడి మాట్లాడుతూ సుమారు 4 గంటలపాటు మేధావులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏవిధంగా రిజర్వేషన్లు అమలుచేస్తున్నాయనే అంశాలపై చర్చించామన్నారు. 15రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో ఉన్న ఇబ్బందులను ఈ 3 రాష్ట్రాల ప్రభుత్వాలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సంబంధింత కేంద్రశాఖ మంత్రి, అధికారులతో పాటు 3 రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులు, గవర్నర్, ఇతర మంత్రులను కలిసి రిజర్వేషన్‌కు సంబంధించిన అంశాలపై వివరిస్తామన్నారు. తమిళనాడు మాదిరిగానే స్థానిక ఎన్నికల్లో 69 శాతం రిజరేషన్‌తో పాటు విద్యా,ఉద్యోగాల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వేషన్ సాధించుకోవడానికి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. విడిపోయిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బీసీ, ఎస్సీ,ఎస్టీ సోదరులంతా ఒక్కటై మనకు కావాల్సిన హక్కులన్నీ సాధించుకోవాలని మహారాజ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వేషన్ల శాతాన్ని మరింత పెంచేలా త్వరలో జరిగే రెండో సమావేశంలో సంపూర్ణ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో పారిశుధ్య కార్మికురాలి మృతి



రమణమ్మ (ఫైల్)

పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో పారిశుధ్య కార్మికురాలు మరణించిన సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురంలో గురువారం జరిగింది. పురపాలకసంఘంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న ముత్యాల రమణమ్మ (55) విధులు ముగించుకుని ఉదయం 11గంటల సమయంలో మంగాయమ్మ రావుపేటలోని తన నివాసానికి చేరుకుంది. ఇల్లు శుభ్రం చేస్తుండగా తడి కర్రకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30న ఉమ్మడి జిల్లా 'హేతువాద' మహాసభ

అమలాపురం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘం వార్షిక మహాసభ ఈనెల 30న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో జరుగుతుందని జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, డి.రాజశేఖర్ తెలిపారు. మహాసభల్లో భాగంగా మేడూరి సత్యనారాయణ రచించిన బౌద్ధం-హేతువాద మానవవాద ఉద్యమం అనే గ్రంథాన్ని తేరాటి వసంతరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. మత విశ్వాసాలు-హేతువాదం, మూఢవిశ్వాసాలు-భావవిప్లవం తదితర అంశాలపై హేతువాద సంఘ ప్రముఖుల ఉపన్యాసాలు ఉంటాయన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన వారంతా మహాసభలకు హాజరు కావాలని కేవీవీ కోరారు. వివరాలకు 9949691007లో సంప్రదించాలని కోరారు.

గట్టిగా పట్టు.. వలకట్లు పట్టు!

బలుసుతిప్పలో వలకట్ల అత్తరాల (స్థలాలు) కోసం పడవ పోటీలు





గోదావరిలో పడవ పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు



కాట్రేనికోన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో గోదావరిలో వలకట్ల అత్తరాల (స్థలాలు) కోసం గురువారం పడవ పోటీలు జరిగాయి. మత్స్యకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోదావరికి వరదలు వచ్చినప్పటి నుంచి వరద తగ్గి ఉప్పునీరు వచ్చే వరకు వేట నిలిపివేయడం మత్స్యకారుల కట్టుబాటు. ఉప్పునీరు వచ్చిన తర్వాత బలుసుతిప్ప నుంచి కోటిపల్లి వరకు గోదావరిలో వలకట్ల కోసం సుమారు 100 ఇంజన్ బోట్లతో మత్స్యకారులు పోటీల్లో పాల్గొంటారు. ఎవరైతే పడవ పోటీల్లో గోదావరిలో వలకట్ల స్థలం దక్కించుకుంటారో వారికి మళ్లీ వరదలు వచ్చే వరకు గోదావరిలో ఆ స్థలం కేటాయింపు చేస్తారు. గోదావరిలో ఏ ప్రాంతంలో చేపలు ఎక్కువగా పడతాయో స్థానిక మత్స్యకారులకు అవగాహన ఉంటుంది. గోదావరిలో పడవలో వెళ్లి ఆ ప్రాంతాన్ని దక్కించుకుంటారు. ఏటా దీపావళి అనంతరం ఈ పోటీలు నిర్వహిస్తారు. దీంతో ప్రస్తుతం జరిగిన ఈ పడవ పోటీలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.

వృద్ధురాలిపై అత్యాచారం.. నిందితుడికి ఏడేళ్ల జైలు

కరప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడికి న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలిపై గతేడాది ఆగస్టు 29వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. సాక్షుల విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్య నాయుడు తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ కనుమూరి రాధాకృష్ణరాజు ఈ కేసును వాదించారు.

జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఖైదీ మృతి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఖైదీ మెట్టు భాస్కరరెడ్డి (53) మృతిచెందాడు. 3 దశాబ్దాల క్రితం జరిగిన బాబాయి, కుమారుడు హత్య కేసుల్లో భాస్కరరెడ్డి నిందితుడిగా ఉన్నాడు. నేరం రుజువు కావడంతో గత ఐదేళ్ల నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ ఏడాది ఆగస్టు 31 అనారోగ్యం పాలవ్వడంతో తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎస్కార్ట్ సిబ్బందితో కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. అనారోగ్య పరిస్థితి విషమించడం, ఊపిరితిత్తుల సమస్యతో ఖైదీ ఆరోగ్యం విషమించి బుధవారం మధ్యాహ్నం మరణించినట్టు వైద్యులు తెలిపారు.

మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల గ్యాంగ్ సంచారం

అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణం పోలీసులకు సమాచారమివ్వాలి

కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల బ్యాచ్ దువ్వాడ-స్టీల్ ప్లాంట్ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... కాకినాడ జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణం డయల్ 100, 111 నెంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఓ ప్రకటనలో కోరారు. బుధవారం రాత్రి ఈ దొంగల బ్యాచ్ స్టీల్‌ప్లాంట్ ప్రాంతాల్లో తిరిగారని అనకాపల్లి మీదుగా కాకినాడ జిల్లాలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పదంగా వాహనాలు తిరిగినా, వ్యక్తులు సంచరిస్తున్నా తక్షణం సెక్యూరిటీ, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేయాలన్నారు. ఇళ్లను లాక్ చేసి బయటకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ని వినియోగించుకోవాలని కోరారు. రాత్రి పూట ఇంటి భద్రతా చర్యల్లో భాగంగా ప్రధాన తాళాలు, గేట్లు, గ్రిల్స్ బిగించి ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో పర్యవేక్షించుకోవాలన్నారు. ముందస్తు భద్రత చర్యలు తీసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

పుట్టినరోజు వేడుకలో వాగ్వాదం

కుప్పకూలి వ్యక్తి మృతి

తాటిపర్తిలో ఘటన



మరణించిన సూరిబాబు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గురువారం రాత్రి జరిగిన వాగ్వాదంలో ఒక వ్యక్తి కుప్పకూలి మరణించాడు. గ్రామానికి చెందిన శ్రీమంతుల దయ మనుమరాలు పుట్టినరోజు వేడుక చేస్తూ రోడ్డుకు అడ్డంగా బల్లలు పెట్టారు. అదే సమయంలో వెంపల సూరిబాబు కోడలు కృష్ణవేణి అటుగా వెళ్తూ బల్లకు తగులుకోవడంతో బల్ల పడిపోయింది. దీంతో రెండు కుటుంబాల మధ్య వివాదం జరిగి వాగ్వాదానికి దారితీసింది. ఒకరిపై ఒకరు పెద్దగా కేకలు వేసుకుంటున్న సమయంలో వెంపల సూరిబాబు (59) ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. అతడిని పిఠాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో విస్తృతంగా తనిఖీలు

కాకినాడ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గురువారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కాకినాడ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, పార్కుల్లో పోలీసు బాంబు స్క్వాడ్ బృందం సభ్యులు రామకృష్ణ, మణికంఠ, డాగ్ హ్యాండ్లర్ శ్రీనివాస్, డాగ్ మ్యాక్స్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేశారు.

సంతకు వెళ్లొస్తుండగా...

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

మహిళ మృతి

ముగ్గురికి గాయాలు

ఆటోడ్రైవర్ పరిస్థితి విషమం

చింతూరు, మోతుగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని సుకుమామిడి సమీపంలో ఈ ఘటన జరిగింది. మోతుగూడెం ఎస్ఐ సాదిక్ కథనం మేరకు.. మోతుగూడెనికి చెందిన చిరు వ్యాపారులు ప్రతీ గురువారం సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లోని కుంటలో జరిగే వారాంతపు సంతకు వెళ్లి తిరిగి సాయంత్రం ఆటోలో మోతుగూడెం చేరుకుంటారు. గురువారం సంత ముగించుకుని తిరిగి మోతుగూడెం వస్తుండగా సుకుమామిడి సమీపంలో ఓ ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి ఆటో ఢీకొంది. ఆటోలో ముగ్గురు ప్రయాణికులు, డ్రైవర్ రాము తీవ్రంగా గాయపడ్డారు. చింతూరు ఆసుపత్రికి తరలించగా వారిలో వేగి మంగ (50) మృతిచెందింది. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం తరలించారని ఎస్ఐ తెలిపారు.



మరణించిన మంగ

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

సుబ్రహ్మణ్యేశ్వరున్ని దర్శించిన ఐజీ అశోక్‌కుమార్


సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

బిక్కవోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ బి.విద్య, సీఐలు సుమంత్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్‌ఐలు రవిచంద్రకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐజీ ప్రాచీన లక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చదువుతో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి క్రమశిక్షణ, సహనశీలత వంటి గుణాలను అలవర్చుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి సూచించారు. గురువారం ప్రభుత్వ బాలిక సదనాన్ని ఆమె సందర్శించి వసతి,సదుపాయాలను పరిశీలించారు. బాలికలకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించారు. న్యాయ సహాయం కోసం 15100 హెల్ప్‌లైన్‌ని సంప్రదించాలని సూచించారు.అనంతరం మానస ఆస్పత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మానసిక రుగ్మతల నుంచి కోలుకున్న వారిని తిరిగి వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడానికి చొరవ చూపాలన్నారు.ఈ విషయంలో డీఎల్ఎస్ఏ పూర్తి సహకారం అందిస్తుందన్నారు.

నేడు గోకవరంలో ప్రజా దర్బార్

గోకవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు పిల్లా చంటిబాబు తెలిపారు.గోకవరంలో గురువారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రజా దర్బార్ ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి సత్వర పరిష్కారం కోసం ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

రేపు ఏపీఆర్-జేఏసీ ఆత్మీయ సమావేశం

గోకవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 29న జరిగే ఏపీఆర్-జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని పీఎంపీ జిల్లా కోశాధికారి, మండల కన్వీనర్ పెంటిమేని చిన్ని తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల వృత్తి పరిరక్షణ, ప్రభుత్వ గుర్తింపు లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని పీఎంపీ, ఆర్ఎంపీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

సత్యదేవా నర్సరీలో ఒడిస్సా ఎన్నికల బృందం


సత్యదేవా నర్సరీలో ఒడిస్సా ఎన్నికల బృందం

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని గురువారం ఒడిస్సా జిల్లా పరిషత్, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి 33 మంది అధికారుల బృందం సందర్శించింది. వీరికి నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణ మొక్కను ఇచ్చి స్వాగతించారు. ఫలసప్తవర్ణ దళాలు, పుష్పాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని బృందం సభ్యులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో నర్సరీ రైతులు ప్రధాన పాత్ర పోషించడం ఎంతో అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎస్.భాస్కరనాయక్, కితిక్ మి శ్రా, సౌరవ్‌కుమార్, పుల్లా రామకృష్ణ, ఎంపీ డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీని చూసైనా జగన్ నేర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇటీవల నిర్వహించిన మాక్ అసెంబ్లీని చూసైనా మాజీ సీఎం జగన్ నేర్చుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు గురువారం ఓ ప్రకటనలో అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీని కౌరవ సభలా నిర్వహించిన జగన్ నియంతలా పాలన సాగించారన్నారు. ఇప్పుడిప్పుడే లోకం చూస్తున్న విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీతో జగన్ వంటి వారికి కనువిప్పు కలగడంతో పాటు అసెంబ్లీని ఎలా నిర్వహించాలి, ప్రతిపక్షంలో ఎలా వ్యవహరించాలో తెలుస్తుందన్నారు. చిన్నపిల్లలైనా ఎలాంటి తాత్కాలిక శాశ్వత బహిష్కరణలకు తావివ్వకుండా ప్రజా సమస్యలను సభలో ప్రస్తావిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని, జగన్ ఇప్పటికైనా అసెంబ్లీకి హాజరై ప్రజాసమస్యలపై చర్చించాలని అప్పారావు అన్నారు.

రాజీవ్‌గాంధీ కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలు


హర్షకుమార్‌ను సత్కరిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.సీనియర్ క్యాడెట్స్‌కు ర్యాంక్ పిప్పింగ్ సెర్మన్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా కళాశాల చైర్మన్ జీవీ హర్షకుమార్, ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్-3 కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్ఎస్ హాజరయ్యారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ మేరి జోన్స్ రోసెట్టి, రిటైర్డ్ ఎన్‌సీసీ ఆఫీసర్ కళ్యాణి భగనల్ హాజరై ఎన్‌సీసీ ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా క్యాడెట్స్ నిర్వహించిన కల్చరల్ శౌర్య కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.అనంతరం ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ శైలజ, కేర్ టేకర్ నరసింహా ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎన్‌సీసీ ఆఫీసర్ భగత్‌ను సత్కరించారు.

రాజ్యాంగంపై అవగాహనకు మీలో ఎవరు మేధావి

అనపర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలన్న లక్ష్యంతో మండలంలోని పులుగుర్త జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ విద్యార్థులకు పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. మండలంలోని ఉన్నత పాఠశాల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు అనపర్తిలోని కేఏఆర్ ఉన్నత పాఠశాల వేదికగా గురువారం ఈ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, హెచ్ఎం సుజాత నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కళ్యాణి, బాలుర హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేలంగికి ఘన నివాళి

రంగంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హాస్యనట చక్రవర్తి రేలంగి వెంకట్రామయ్య 50వ వర్ధంతి అడబాల మరిడియ్యా కాపు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రంగంపేట నేతి వెంకటేశ్వర కర్రల మిల్లు ఆవరణలో రేలంగి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు.మరిడియ్యకాపు మాట్లాడుతూ రేలంగి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం రావులపాడు గ్రామంలో రామదాసు,అచ్చయ్యమ్మ దంపతులకు ఆగస్టు 9వ తేదీన జన్మించారన్నారు. రేలంగిని 1935లో సినీ దర్శకుడు సి.పుల్లయ్య "శ్రీకృష్ణతులాభారం" సినిమా ద్వారా పరిచయం చేశారన్నారు.రేలంగి 1975లో మరణించారన్నారు.ఈ కార్యక్రమంలో వెలమర్తి వెంకటేశ్వరరావు, పులుగుల సత్యనారాయణ, బెల్లపు సోమరాజు, మాగాపు శ్రీను,చొల్లంగి శ్రీను,గుత్తుల శ్రీను, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మా మనవడొస్తాడు.. తీసుకెళతాడు!

70 ఏళ్ల వృద్ధురాలి ఎదురుచూపులు

రాజానగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజానగరంలోని షిర్డీసాయి బాబా ఆలయం వద్ద గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 70 ఏళ్ల పైబడిన వృద్ధురాలు తనవారి కోసం ఎదురుచూస్తూ కనిపించింది. స్థానికులు ఆరాతీయగా తన పేరు ఆళ్ల వెంకాయమ్మ అని తమది కట్టమూరు అని వడ్లమూరు అని రాజమండ్రి నుంచి వచ్చానని పొంతనలేని సమాధానాలు ఇచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తన మనవడు సత్తిబాబు వచ్చి తీసుకెళ్తాడంటూ పదేపదే చెప్పడం జరిగింది. సాయంత్రం వేళకు ఆమె గురించి ఎవరూ రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమెను సాయిబాబా ఆలయ సమీపంలోని వృద్ధాశ్రమంలో చేర్పించారు.

చిన్నారుల మాక్ అసెంబ్లీ రంగంపేట మండలం వడిశలేరు,పాతకోటపాడు హైస్కూల్‌లో గురువారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులు దాట్ల అరుణ, శ్రీదేవి, సోషల్ టీచర్ జూలియా,ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. - **రంగంపేట**



సేంద్రీయ వ్యవసాయం లాభదాయకం


తొర్రేడులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

» రైతులతో కలెక్టర్ కీర్తి ముఖాముఖి
» పలుచోట్ల రైతన్నా మీ కోసం

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ వ్యవసాయం వైపు మారడం ద్వారా రైతులకు లాభదాయకమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని తొర్రేడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని రైతులతో నేరుగా మాట్లాడారు. సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల భూసారాన్ని పెంపొందించుకోవడంతోపాటు ఆరోగ్యకరమైన పంటలు సాగు చేసుకోవచ్చని అన్నారు. వరి సాగు వల్ల కలిగే లాభాలు, ఖర్చుల వివరాలను, ధాన్యం బస్తా గిట్టుబాటు ధర తదితర విషయాలను నేరుగా రైతులను తెలుసుకున్నారు. దీనిపై ఖరీఫ్ సీజనులో లాభం వస్తే ఎకరాకు రూ.2 వేలు వరకు వస్తుందని, వాతావరణం అనుకూలించకపోతే రూ.20 వేలు నష్టం వస్తుందన్నారు. రబీ సీజనులో రైతులకు వరి సాగులో లాభం వస్తుందన్నారు. ఖరీఫ్ సీజనులో బస్తా రూ.1400కే అమ్ముకున్నామని రైతులు తెలిపారు. దీనిపై ఎందుకని కలెక్టర్ ప్రశ్నించగా పంట చేతికొచ్చే సమయానికి రైతు సేవా కేంద్రాలు తెరవలేదని తెలిపారు. అంతలో వ్యవసాయాధికారి మాధవరావు కలుగజేసుకుని తుఫాను వల్ల నష్టం వచ్చిందంటూ చెప్పుకొచ్చారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కొత్త అవిష్కరణలతో సాగు చేసి మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. రైతులు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో కళ్లాల్లో నిల్వ వున్న ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద అందుతున్న ఆర్థిక సాయంతో పంట పెట్టుబడికి తోడ్పడుతుందన్నారు. ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని కలెక్టర్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకటరమణ, ఏడీఏ రమేష్, సొసైటీ సీఈవో కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో గోరంట్ల రవిరామ్ కిరణ్.. మండలంలోని హుకుంపేటలో జరిగిన కార్యక్రమానికి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ విచ్చేసి మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ధాన్యం సేకరించిన 48గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్మును జమ చేసిన ఘనత కూటమిదేనన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, ఏడీఏ సూర్యరమేష్, సొసైటీ చైర్మన్ బొప్పన శ్రీనివాస్, టీడీపీ నాయకులు మచ్చేటి ప్రసాద్, దుద్దుపూడి రమేష్, మద్దిపాటి సత్యప్రసాద్, సోము వినయ్, వై.సత్యనారాయణ, పెండ్యాల రామకృష్ణ, వల్లేపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంక్రాంతికి రహదారి పనులు పూర్తవ్వాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నాటికి నియోజకవర్గంలోని రోడ్డు పనులు, మంచినీటి సరఫరా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఐయూ, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలతో గురువారం ఆయన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్ల పటిష్ట పరచడం, విస్తరణ పనులు ప్రతిపాదించాలన్నారు. ముఖ్యంగా రాజానగరం-బూరుగుపూడి రోడ్డు, దివాన్‌చెరువు-పుణ్యక్షేత్రం, మోరంపూడి-పుణ్యక్షేత్రం రోడ్డు, కోరుకొండ-నాగంపల్లి, రాజనగరం, చిన కొండేపూడి, కలవచెర్ల, రాపాక-చిన కొండేపూడి, చక్రద్వారబంధం, శ్రీరాంపురం-పోలీస్ క్వార్టర్స్ శ్రీక్రిష్ణ పట్నం-పిడింగొయ్యి, రాజవోలు-కొండగుంటూరు, శ్రీక్రిష్ణ పట్నం-కానవరం, నరసాపురం- కణుపూరు, బుచ్చింపేట-గాదరాడ రహదారరుల పనులు ప్రతిపాదించాలని తెలిపారు. ఇప్పటికే పూర్తి చేసిన పంచాయతీరాజ్ రోడ్లను శంకుస్థాపనలకు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్తగా మరో రూ.1 కోటి అంచనాలతో వివిధ గ్రామాల్లో రహదారులు, నీటి సరఫరా పనుల ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. రూ.30కోట్లతో పుష్కరాలలో పీఆర్ రోడ్లు పనులు ప్రాధాన్యత ప్రకారం తయారు చేయాలని అధికారులకు తెలిపారు. ఇప్పటికే ప్రతిపాదించిన శ్మశాన వాటికల పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. బూరుగుపూడి, మునగాల, దోసకాయలపల్లి, కోటి కేశవరం, నరసాపురం, జంబుపట్నంలలో చేపట్టిన మంచి నీటి సరఫరా పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. దివాన్ చెరువు, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడలో మంచి నీటి సరఫరా పనులు సమీక్షించారు. భవిష్యత్తులో మంచి నీటి సరఫరాకి ఇబ్బంది లేకుండా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రతిపాదన ప్రభుత్వానికి నివేదించామని ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు.

నన్నయలో ఆలిండియా బెస్ట్ ఫిజిక్ చాంపియన్‌షిప్


నన్నయ విశ్వవిద్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

» డిసెంబరు 27 నుంచి 30 వరకూ పోటీలు: వీసీ ప్రసన్నశ్రీ
» బ్రోచర్ ఆవిష్కరణ

దివాన్‌చెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రీడా బోర్డు ఆధ్వర్యంలో డిసెంబరు 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాలు ఉత్తమ శారీరాకృతి(బెస్ట్ ఫిజిక్) చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించి వివరాలు తెలిపారు. ఈ పోటీలకు దేశం నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరవుతారని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు డిసెంబరు 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్సైట్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య కేవీ స్వామి, అసోసియేట్ కార్యదర్శి ఎంవీఎస్ఎస్ మూర్తి, ప్రిన్సిపాల్స్, వర్శిటీ అధికార్లు, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేందుకు సీఆర్‌టీ

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ(సీఆర్‌టీ) కేవలం ఉద్యోగం పొందడం కోసమే కాదని వాస్తవ సవాళ్లను ఎదుర్కొవడానికి దోహదపడుతుందని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్శిటీలో ఏడు రోజులుగా బీటెక్ ఆఖరి ఏడాది విద్యార్థులకు నిర్వహించిన సీఆర్‌టీ గురువారం ముగిసింది. కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఇంటర్వ్యూ నైపుణ్యాలపై తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి, ట్రైనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధవళేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని బ్యారేజ్ ఫీడర్, టీఎస్ఆర్ ఫీడర్లు మరమ్మతుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో అధికారి ఎస్.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల ధవళేశ్వరంలోని ఇరిగేషన్ కార్యాలయ ప్రాంతం, అగ్రహారం, క్వారీ కెనాల్ రోడ్డు,బత్తిన సుబ్బారావు నగర్, సాయి ప్రియాంక కాలనీ, కాటన్ పేట, ఎర్రకొండ, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు దివాన్‌చెరువు పరిధిలో..

దివాన్‌చెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లలో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 29న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ(ఆపరేషన్) జేపీబీ నటరాజన్ గురువారం తెలిపారు.ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ దివాన్‌చెరువు,పాలచర్ల,శ్రీరాంపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

డిప్యూటీ ఎంపీడీవోగా దేవదాసుకు పదోన్నతి

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కడియం మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ దేవదాసుకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. దేవదాసును జీఎస్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దేవదాసుకు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్, ఎంపీడీవో కార్యాలయ ఏవో సుబ్బారావు,డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రంగంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాలిక అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేశామని రంగంపేట ఎస్‌ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. రంగంపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ముంగి వెంకన్నబాబు కుమార్తె ముంగి తేజసత్య(15) గురువారం రాత్రి ఒంటి గంటకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఉదయం గమనించిన కుటుంబీకులు బంధువుల ఇళ్ల వద్ద,పరిసర గ్రామాల్లోనూ వెతికినా ఆచూకీ కానరాలేదు. దీంతో కంగారుపడి తండ్రి ముంగి వెంకన్నబాబు రంగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. బాలిక సమాచారం తెలిసిన వారు రంగంపేట ఎస్‌ఐ 9440904854, అనపర్తి సీఐ 9440796538 నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో హోమాలు

దివాన్‌చెరువు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నందూరి సుబ్బారావు, సత్యవతి దంపతులు సుబ్రహ్మణ్యస్వామి మూలమంత్ర హోమం, లక్ష్మీహోమం, ధన్వంతరీ హోమం, సరస్వతిహోమం అనంతరం మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం స్వామి వారి పల్లకీ ఊరేగింపు జరిపారు. సాయంత్రం పునఃపూజ, శ్రీపుష్పోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయార్చకులు తుట్టగుంట అజయ్ కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అధిక భక్తులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై ప్రజాభిప్రాయ సేకరణ

సీతానగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) చినకొండేపూడి గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామ సభను గురువారం ఉదయం చినకొండేపూడి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. నంబూరి సత్యనారాయణరాజు (ఎల్ఐసీ రాజు) పాల్గొని మాట్లాడుతూ గ్రామ సభ జరుగుతున్న విషయం ప్రజలకు పూర్తిగా తెలియబర్చకుండా సభ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇంకా సుమారు 300 మందికి సభ విషయం తెలియదని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇదే కాకుండా స్వామిత్వ సర్వేలో సర్వే చేసిన సర్వేయర్లు కూడా సభకు రాకపోతే గ్రామ సభ ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. గురువారం నిర్వహించిన గ్రామసభకు తక్కువ మంది హాజరు కాగా వారిలో ఉద్యోగులు కూడా ఉన్నారు. జనాన్ని చూపించుకోవడానికి వారిని కూడా హాజరుపర్చినట్టు ఉందని పలువురు విమర్శించారు. కాగా సభకు తక్కువ మంది రావడంతో మళ్లీ ప్రజలకు నోటీసులు ఇచ్చి మరోసారి గ్రామసభ నిర్వహిస్తామని శ్రీనివాస్ తెలిపారు. స్వామిత్వ సర్వేలో భాగంగా జరుగుతున్న సర్వేలో ప్రజలకు కలిగిన ఇబ్బందులను, సమస్యలను తెలుసుకుని వాటి సరిదిద్దడానికి ఉద్దేశించి గ్రామ సభ నిర్వహించామని, ప్రజలు స్పందించి గ్రామ సభకు హాజరై సమస్యలను తెలియజేయాలని కోరారు. రెండు రోజుల్లో మరోసారి గ్రామసభ నిర్వహిస్తామని, ఆ విషయం అందరికి తెలియజేస్తామని, ప్రతి ఒక్కరు హాజరై తమ సమస్యలను తెలిపి పరిష్కారం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.రామకృష్ణం రాజు, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కల్పించాలి

ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి

అనపర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని, దీని కోసమే కేంద్ర ప్రభుత్వం బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని వంద రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించిందని ఐసీడీఎస్ రంగంపేట సీడీపీవో కృష్ణవేణి అన్నారు. గురువారం అనపర్తిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి బాల్య వివాహల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమం క్షేత్ర స్థాయిలో జరిగే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

సీతానగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) రాబోయే సంవత్సర కాలంలో గ్రామ సభ్యులకు ఏమి అవసరమో ప్రణాళిక సిద్ధం చేయాలని ఏపీఎం జిలాని సూచించారు.గురువారం స్థానిక మండల సమాఖ్య భవనంలో సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులకు నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది అంశాల పట్ల పత్యే శిక్షణలో చర్చించి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. వీటిలో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సంపద సృష్టి ప్రవర్తనలో మార్పు, సుస్థిర జీవనోపాధి, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. తద్వారా కావలసిన సొమ్ము ముందుగా అంచనా వేసి బడ్జెట్ అంచనా తయారు చేసి తీర్మానం చేయాలన్నారు. ఈ నివేదికను ఎస్ఆర్ఎల్ఎం వారికి పంపుతామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల లీజును సద్వినియోగం చేసుకోండి

బిడ్డర్లకు అవగాహన సమావేశంలో ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి మూర్తి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు బస్‌స్టాండ్ల పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారని, ఈ అవకాశాన్ని బిడ్డర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి అన్నారు. గురువారం రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లో కాకినాడ జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్‌లతో కలసి నిర్వహించిన అవగాహన సమావేశంలో మూర్తి మాట్లాడారు. బస్‌స్టాండ్లలోని ఖాళీ స్థలాల వివరాలను, లీజు విధానాలు, ఇతర నిబంధలను వారికి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) శేషగిరిరావు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు రాజ్యాంగ విలువలను పాటించాలి

రంగంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీఒక్కరు రాజ్యాంగ విలువలను పాటించాలని హెచ్.ఎం. వి.పార్థసారధి సూచించారు. గురువారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవం, సోషల్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందరితో సామూహికంగా రాజ్యాంగ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛలను అందించిందన్నారు. విద్యార్థులు రాజ్యాంగ విలువలు-యువత బాధ్యత అంశంపై ప్రసంగం, వ్యాసరచన, స్కిట్‌లు ప్రదర్శించారు. విద్యార్థులు అంబేడ్కర్, నెహ్రూ,గాంధీ, తెలుగుతల్లి, ఝాన్సీ లక్ష్మీభాయ్‌ల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

రాజానగరం: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎండీ అక్బర్, విజయానంద్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు.విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు ఎ.శాంతిలత, జ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ పీవో బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి ఆలయంలో మార్గశిర పూజలు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో కనకమహలక్ష్మి దేవి ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి పాత్రమైన గురువారం రోజు సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి వివిధ రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, హరిద్రోదక క్షీర అభిషేకాలు సమర్పించారు.కోరిన కోరికలు తీర్చే అమ్మవారి దర్శనం ఈ మాసంలో ప్రత్యేకమైనదని ఆలయార్చకులు సాయిరాం తెలిపారు.





తొర్రేడు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

18 మండలాలకు జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారుల నియామకం

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణల్లో భాగంగా గ్రామ వార్డు సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం మండల జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారులను నియమించింది. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 18 మందిని డిప్యూటీ ఎం పీడీవో హోదాలో నియమించారు. ఈ మేరకు కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 12 మంది ప్రస్తుతం జిల్లా పరిధిలోనే ఉండగా పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఆరు గురు పని చేస్తున్నారు. వారంతా వెంటనే విధు ల్లో చేరవలసి ఉంది.ఆర్‌వీ సత్యనారాయణ (గోపాలపురం). ఎం.శ్రీనివాస్ (రంగంపేట). టి.గోపాలకృష్ణ (నిడదవోలు), కెఎస్‌వి వీరన్న (తాళ్లపూడి), కెవివి రాంబాబు(నల్లజర్ల), ఎస్.శ్యాంప్రసాద్ (కడియం), డి.ముత్యం (కొవ్వూరు), వి.శ్రీరామమూర్తి (గోకవరం), సిహెచ్.దేవదాసు (రాజానగరం), సిహెచ్ శ్రీశాస్త్రి (అనపర్తి), మల్లిడి వెంకటరెడ్డి(సీతానగరం), వై.మునేశ్వరరావు(బిక్కవోలు), గుణ్ణం ప్రసాదరావు (కోరుకొండ), కాయల వి.సత్యనారాయణ (దేవరపల్లి),దాసరి సూర్యనారాయణ (రాజమండ్రి రూరల్), పుల్లేటికుర్తి అచ్యుత రామకృష్ణ (చాగల్లు),కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(పెరవలి), టి.శేషుబాబు(ఉండ్రాజవరం)నియమితులయ్యారు.



ఏపీలోనూ కమలం వికసించాలి

ప్రశిక్షణ వర్గ్‌కు హాజరవుతున్న, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ పురందేశ్వరి తదితరులు

ఏపీలోనూ కమలం పార్టీ బలోపేతానికి నాయకులు నడుం బిగించారు.. ఎక్కడికక్కడ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.. గురువారం రాజమహేంద్రవరం వేదికగా గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్సీ సోమ వీర్రాజు తదితరులు దిశా నిర్దేశం చేశారు.

6

చైల్డ్ ట్రాకింగ్ రిజిస్టర్ తప్పనిసరి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారి కోసం చైల్డ్ ట్రాకింగ్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. తొర్రేడులో గల అంగన్ వాడీ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. 0-3 ఏళ్ల పిల్లల ఇంటి సందర్శనలు నిరంతరం చేయాలని తల్లిదండ్రులకు పోషకాహారం, శిశు వికాసం హెచ్చరిక సంకేతాలు, తక్షణ వైద్య సహాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి హెల్త్ కార్డులో ఇమ్యునైజేషన్, ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల్లో వైద్యుల నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా సందర్శనలు జరగాల న్నారు. ఏఎన్‌ఎంలు హెల్త్ విజిటర్లు, అంగన్‌వాడీ కార్మికుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సూచించారు.

వచ్చే నెల 4 నుంచి స్కూల్ బస్‌ల తనిఖీ

జిల్లా రవాణా అధికారి సురేష్



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి డిసెంబరు 4వ తేదీ వరకూ స్కూల్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు తనిఖీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రత్యేక బృందాలు ఉదయం, సాయంత్రం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తాయని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో 2 వేలకు పైగా బస్సులు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. నిబంధనల మేరకు తనిఖీలు చేస్తామన్నారు.

కొత్తగా 217 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1,581 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 217 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ గురువారం 2026 ఎస్ఐఆర్ సన్నాహక కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో మొత్తం 16,23,741 ఓటర్లలో 4,19,204 మందిని బీఎల్‌వో యాప్ ద్వారా మ్యాప్ చేశామన్నారు. కొత్తగా 12,696 మంది వివరాలు బీఎల్‌వోలు నమోదు చేశారన్నారు.జిల్లాలో హేతుబద్ధీకరణ తర్వాత అనపర్తిలో 248, రాజానగరం 238, రాజమహేంద్రవరం నగరం 263, గ్రామీణం 309, కొవ్వూరు 212, నిడదవోలు 248, గోపాలపురం నియోజకవర్గంలో 280కి పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగిందన్నారు. ఓటరు ఐడీ కార్డులు జిల్లాకు 14,123 వచ్చాయన్నారు.12,762 కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ మేఘ స్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 30 వరకు దరఖాస్తులు


రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ రాజమహేంద్రవరం సంచాలకులు బి.శశాంక శుక్రవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. ఆసక్తి కలిగి అర్హత ఉన్న అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్‌లో నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్ కోటా ప్రకారం బీసీ 66 శాతం, ఎస్సీ 20 శాతం, ఎస్టీ 14 శాతం ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైతే విజయవాడ గొల్లపూడిలో ఉన్న బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తా రన్నారు. వివరాలకు 94944 52267, 9000 058102 నెంబర్లలో సంప్రదించాలన్నారు

ఇద్దరు ఖైదీలకు క్షమాభిక్ష

సెంట్రల్ జైలు నుంచి విడుదల

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు జీవిత ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. దీంతో గురువారం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మాదిరి సువర్ణరాజుకు హత్య కేసులో 2010లో కోర్టు జీవిత ఖైదు విధించింది. 2016లో హైకోర్టు అప్పీలును తిరస్కరించింది. 2018లో సుప్రీం కోర్టు శిక్షను ఖరారు చేసింది. బిక్కవోలు మండలం కొమరిపాలెంకు చెందిన కటికిరెడ్డి నాగేశ్వరరావుకు హత్య కేసులో కోర్టు 2011లో జీవితఖైదు విధించింది.2018లో హైకోర్టు అప్పీలును తిరస్కరించగా సుప్రీం కోర్టులో అప్పీలు పెండింగ్‌లో ఉంది. ఇతను శిక్షా కాలంలో పెరోల్, పర్లో ఉపయోగించుకోలేదు. వీళ్లిద్దరూ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ నెం.165 ద్వారా స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు.

మూడు కాదు.. నాలుగు!



నాలుగు జిల్లాలతో ఉమ్మడి తూర్పుగోదావరి

అడిగింది లేదనలేదు.. కోరింది కాదనలేదు.. ఆశలు ఫలించాయి.. ఆకాంక్షలు నెరవేరాయి.. గత వైసీపీ చేసిన తప్పులను సరిదిద్దుతూ సరికొత్త బాటలు వేశారు.. కొత్త సరిహద్దులు నిర్ణయించారు.. గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఎక్కడో 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది..దీంతో ఇబ్బందులకు గురయ్యేవారు.. ఇది గమనించిన చంద్రబాబు ఏజెన్సీ వాసులకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.. ఈ మేరకు రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు.. ఇప్పటి వరకూ తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలు మాత్రమే ఉండేవి. నాలుగో జిల్లాగా పోలవరం చేరింది. పెద్దాపురం నియోజకవర్గంలో ఉన్న సామర్లకోట కాకినాడ డివిజన్‌లో ఉండేది.. డివిజన్ కేంద్రం మార్చాలని ఏనాటి నుంచో విన్నపాలు చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వం సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో చేర్చింది. మండపేట నియోజకవర్గం కోనసీమ జిల్లాలో ఉండేది. ఈ నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేశారు. ఈ మార్పులు..చేర్పులపై 30 రోజుల్లో అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

- » కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు
- » జిల్లా కేంద్రంగా రంపచోడవరం
- » తూర్పులో చేరిన మండపేట
- » పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట
- » నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కారు
- » 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

నాలుగోది గిరిజన జిల్లా

రంపచోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం మూడు కాదు.. నాలుగు జిల్లాలు. సీఎం చంద్రబాబు ఆమోదంతో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం జీవో నెం 1492తో గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రంపచోడవరం డివిజన్ పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గుర్తేడు, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి మండలాలు.. చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలను కలిపి ఈ కొత్త గిరిజన జిల్లాగా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాల ఏర్పాటు చట్టంలోని నిబంధనల మేరకు ప్రాథమిక ప్రకటనను జారీ చేసే అధికారాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్‌కు కట్టబెడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గురువారం నుంచి 30 రోజుల వ్యవధిలో ఈ ప్రతిపాదిత జిల్లా ఏర్పాటు విషయంలో తమకు ఉన్న అభ్యంతరాలు, మెరుగైన సూచనలను అల్లూరి జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా తెలియపరచవచ్చు. గడువు ముగిసిన అనంతరం ప్రభుత్వం ఈ కొత్త జిల్లా ఏర్పాటును గెజిట్ రూపంలో ప్రకటించడం ఇక లాంఛనమే. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రంపచోడవరం, చిం తూరు డివిజన్‌లోని ప్రజలకు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇంతవరకూ ఉన్న వందలాది కిలోమీటర్ల భారం తగ్గుతోంది.

పోలవరం లేని జిల్లా

పోలవరం పేరుతో ప్రకటించిన ఈ జిల్లాలో పోలవరం ప్రాంతానికి చోటే లేదు. ఈ జిల్లాకు పోలవరం అనే పేరు ప్రభుత్వం ఎందుకు పెట్టిందన్నది చర్చనీయాంశంగా మారింది. 30 రోజుల గడువు అనంతరం ఈ జిల్లా పరిధిలో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ కొత్త జిల్లా పరిధిలోనే పోలవరం ముంపు మండలాలు పూర్తిగా రెండు, పాక్షికంగా మూడు ఉండడం గమనార్హం. పోలవరం ప్రాజెక్టు కింద రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల పరిధి లోని ఉన్న ముంపు గ్రామాల గిరిజన నిర్వాసితులందరికీ కొత్త జిల్లా పరిధిలోనే పునరావాసం కల్పించే యోచన కూడా ప్రభుత్వానికి ఉందని తెలుస్తోంది.

ఇక పెద్దాపురంలోనే సామర్లకోట

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలాన్ని ఇక నుంచి పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవోఆర్‌టీ 1493 పేరిట గురువారం రాత్రి జిల్లా కేంద్రానికి, పెద్దాపురం, కాకినాడ ఆర్డీవో కార్యాలయాలకు ఉత్తర్వులు చేరాయి. మొదటి సార్వత్రిక ఎన్నికల నాడే పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం,సామర్లకోట మండలాలు చేర్చినా పరిపాలనాపరమైన కార్యకలాపాలను మాత్రం పెద్దాపురం మండలం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయ పరిధి, సామర్లకోట మండలం కాకినాడ ఆర్డీవో పరిధిలోను కేటాయించారు. ఎన్నికల నిర్వహణ మాత్రమే పెద్దాపురం ఆర్డీవో పరిధిలో పర్యవేక్షించేవారు.ఒకే నియోజకవర్గం మొత్తం మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇక నుంచి సామర్లకోట మండల కార్యకలాపాలు పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోకి అనుసంధానం కానున్నాయి.

తూర్పున..మండపేట

రాజమహేంద్రవరం/మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ఉండే మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేస్తూ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు డిసెంబరు 31 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ప్రజలు జిల్లా కేంద్రం అమలాపురం వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. నియోజకవర్గం అంతా ఏకతాటిపై నిలబడి తూర్పులో విలీనం చేయాలని పోరాడారు. 2008 వరకు ఆలమూరు నియోజకవర్గం రాజమహేంద్రవరం పార్లమెంట్‌లోనే ఉండేది. 2009లో నియోజకవర్గ పునర్విభజన సమయంలో ఆలమూరు నుంచి విడిపోయి మండపేట నియోజకవర్గం ఏర్పడింది. అప్పుడు ఆలమూరు కొత్తపేట నియోజకవర్గంలో కలవగా మండపేట నియోజకవర్గంలో అనపర్తి నియోజకవర్గం పరిధిలోని రాయవరం మండలం ఇక్కడ కలిసింది. 2009లో ఏర్పడిన మండపేట నియోజకవర్గం 16 ఏళ్ల తర్వాత తిరిగి ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో చేరింది. మండపేట నియోజకవర్గంలో మూడు మండలాలతో పాటు ఒక మునిసిపాలిటీ ఉంది. 42 పంచాయతీలు ఉన్నాయి. మండపేట మునిసిపాలిటీ, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ జనాభా 3.45 లక్షలు ఉండగా ఓటర్లు 2.20 లక్షలు మేర ఉన్నారు. జిల్లాలో 21 మండలాలు ఉంటాయి.రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు మండపేట, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు,జిల్లా అర్బన్, గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి.



వజ్రోత్సవ వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు నిమ్మల, కందుల దుర్గేష్

చరిత్రకు నిదర్శనం వజ్రోత్సవం

నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆనాడు ఎంతో చారిత్రాత్మకమైన ప్రాంతం.. జల రవాణాకు ముఖ్యకేంద్రం.. పశ్చిమ డెల్టాకు ముఖద్వారం అయిన నిడదవోలు పట్టణం 60 వసంతాలు పూర్తి చేసుకుని చరిత్ర చాటిచెప్పే విధంగా వజ్రోత్సవ వేడుకలు చేసుకోవడం అభినందనీయమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నిడదవోలులోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద గురువారం రాత్రి నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు హాజరై మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల సహకారంతో కూట మి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు.నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కావడం గోదావరి జిల్లాలు చేసుకున్న అదృష్టమన్నారు. పట్టణ ప్రజానీకానికి జల జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన గోదావరి జలాలను తాగునీరుగా అందిస్తామన్నారు. 2014 రాష్ట్ర విభజనలో మనకు జరిగిన నష్టం కంటే 2019లో వైసీపీ ప్రభుత్వం చేసిన నష్టమే ఎక్కువ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పు చేసి వెళ్లిపోయిందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా కూటమి ప్రభుత్వం అత్యధిక నగదు సామాజిక పింఛన్లుగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి దుర్గేష్, చైర్మన్ భూపతి ఆదినారా యణ,శశి విద్యాసంస్థల అధినేత బూరుగు పల్లి వేణు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





అధ్వానంగా : రోడ్ కం రైలు వంతెన ఫుట్‌పాత్‌పై పిచ్చిమొక్కలు

పేరు గొప్ప.. వంతెన దిబ్బ!

శిథిలావస్థకు చేరిన రోడ్ కం రైలు వంతెన

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేరులో ప్రత్యేకం.. నిర్వహణలో నిర్లక్ష్యం ఏమిటనుకుంటున్నారా. అదేనండి రాజమహేంద్రవరం, కొవ్వూరు నగరాలను కలుపుతూ గోదావరిపై నిర్మించిన రోడ్డు కం రైలు బ్రిడ్జి. ఈ వంతెన తెలియని వారుండరు. ఎందుకంటే ఆసియాలోనే అతి పెద్ద రెండో ఆర్‌సీఆర్‌బి వంతెన. ఇంత ప్రత్యేకత ఉన్నా నిర్వహణలో అడుగడుగునా అలక్ష్యం కనిపిస్తూనే ఉంది. ఎంతలా అంటే వంతెనపై ఫుట్‌పాత్, ఇరువైపులా ఉన్న రైలింగ్ ఊడి గోదావరిలోకి ఒరిగిపోతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. వంతెన జిల్లా కేంద్రంలోనే ఉన్నా ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన రక్షణకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. బ్రిడ్జి నిర్మించిన తరువాత 18 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బందీ లేదు. ఆ తరువాత నుంచి ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో వంతెన మరమ్మతులకు గురవుతూనే ఉంది. ప్రతిసారి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అధికారులు ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జిని మూసివేసి రాజమహేంద్రవరం వైపు కొంత రైలింగ్ పనులు చేపట్టి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం ఎవరైనా గోదావరి అందాలను తిలకించడానికి ఫుట్‌పాత్ ఎక్కితే రైలింగ్‌తో సహా గోదావరిలో పడిపోయే అంత ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల కొంతమంది అధికారులు కొంత కాలం తరువాత బ్రిడ్జిపై రాకపోకలు కష్టమేనని చెప్పుకోవడం గమనార్హం. పాలకులు వంతెన విషయంలో ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే బ్రిడ్జి పూర్తిగా మూతపడే అవకాశాలున్నాయి. పాలకులారా ఇకనైనా మేల్కొండి. 2027లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. ఆ సమయానికి అయినా బ్రిడ్జికి శాశ్వత మరమ్మతులు చేపట్టి.. సేవలందించేలా చర్యలు తీసుకోవాలని గోదావరి జిల్లాలవాసులు కోరుతున్నారు.





చూస్తే.. పడతాం : రోడ్ కం రైలు వంతెనపై శిథిలావస్థలో రెయిలింగ్



చివరికి.. పరుగో..పరుగు!

తుఫాన్ హెచ్చరికలతో రైతాంగం ఆందోళన

రాజమహేంద్రవరం/అనపర్తి/దేవరపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మళ్లీ అన్నదాతలు ఉరుకులు..పరుగులు పెడుతున్నారు.. చేతికొచ్చిన పంట ఎక్కడ నోటికందకుండా పోతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో తుఫాన్ వస్తుందనే హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో రైతులంతా నిమగ్నమయ్యారు. పంటను కాపాడుకునేందుకు ఉరుకులు.. పరుగులు పెడుతున్నారు.ఒకట్రెండు రోజుల్లో భారీ వర్షాలు రానున్నట్టు వాతావరణ కేంద్రం హెచ్చరికతో రైతులు తమ ధాన్యాన్ని త్వరగా చక్కబెట్టుకుంటున్నారు.కానీ ఇంకా 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాలు,ఖాళీ స్థలాల్లోనూ ఉంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉండకూడదనే నిబంధన వల్ల రైతులు తమ ధాన్యాన్ని వెంటనే అమ్ముకోలేని పరిస్థితి ఉంది. జిల్లాలో 76,941 హెక్టార్లలో వరి సాగు చేయగా ఇప్పటి వరకూ 47,018 హెక్టార్లలో మాసూళ్లు జరిగింది.ఇది 65 శాతం. దీని ద్వారా 2.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇందులో ప్రభుత్వం ఒక లక్షా 70 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కె ట్‌లో 35 వేల మెట్రిక్ టన్నులు విక్రయించారు. 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు సొంత అవసరాలకు ఉంచుకున్నారు. ప్రస్తుతం కళ్లాల్లో 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్టు అంచనా. ఇప్పటి వరకూ రైతులకు రూ.172 కోట్లు చెల్లించారు.గత తుఫాన్‌లో పూర్తిగా నేలకొరిగిన పంటను కోత మిషన్‌తో కోసే వీల్లేకపోవడంతో 15 శాతం పంట పొలాల్లోనే రైతులు కుప్పలు వేసుకున్నారు. ప్రస్తుత తుఫాన్ పరిస్థితిని బట్టి నూర్పులు చేసే విధంగా రైతులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. రైతులు ఆగమేఘాల మీద ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కోతలకు కోసి ఆరబెట్టి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తున్నారు. తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా అందరూ తమ పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. అనపర్తి మండలంలో 9 వేల ఎకరాల్లో వరి సాగుచేయగా 95 శాతం కోతలు పూర్తయ్యాయి. మిగిలిన ఐదు శాతం పంటను కోయాల్సి ఉంది. దేవరపల్లి మండలంలో 9500 ఎకరాల్లో వరి సాగు చేయగా 5 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి.కళ్లాల్లో 5 వేల టన్నుల ధాన్యం ఉంది.ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్టు ఈఈ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపల్లి, గుండేపల్లి, పోతవరం, పోతినీడుపాలెం, చీపురుగూడెం సబ్‌స్టేషన్లల్లో మరమ్మతుల కారణంగా ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

వెంకన్న హుండీ లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ఆలయ సభ్యులు

పెరవలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరప్పాడులో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. దేవాదాయశాఖ తనిఖీదారు పర్యవేక్షణలో ధర్మకర్తలి మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎం. రాధాకృష్ణ తెలిపారు. మొత్తం 41 రోజులకు గాను రూ. 61,051, అలాగే బం గారం 11 గ్రాములు, వెండి 150 గ్రాములు వచ్చాయని పేర్కొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా ముత్యం

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంగిడి పంచాయతీ కార్యదర్శి దాసరి ముత్యం కొవ్వూరు మండల గ్రామ వార్డు సచివాలయ శాఖ డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముత్యంను గ్రామ సర్పంచ్ గోశాల నాగార్జున మండల పరిషత్ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు.

పంగిడి పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం



మాట్లాడుతున్న కళావతి

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంగిడి జడ్పీ హైస్కూల్లో గురువారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జుత్తిక కళావతి ఆధ్వర్యంలో విద్యార్థులచే రాజ్యాంగ పీఠిక చదివించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మధులత, పరమేశ్వరశాస్త్రి, అచ్చయ్య, పితాని రవికుమార్, మురళి, కృష్ణవేణి, శిరీష, రాణి, రమాదేవి, రాజులమ్మ పాల్గొన్నారు.

పోలవరం ప్రాంత ప్రజలను మోసం చేశారు

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నూతన జిల్లాల ఏర్పాటులో సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం పోలవరం ఏజన్సీ ప్రాంత ప్రజలను మోసం చేసిందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ విమర్శించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేసే జిల్లాకు పోలవరం పేరుపెట్టి, పోలవరం నియోజకవర్గంలోని ఏజన్సీ మండలాలను కలపకపోవడం, వారందరినీ ఏలూరు జిల్లాలోనే ఉంచడం విడ్డూరంగా ఉందన్నారు. పోలవరం ప్రాంత మన్యం ప్రజలను కలపకపోవడంపై అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనివెనుక గిరిజనేతర నాయకుల ప్రమేయం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

వృద్ధాశ్రమాల్లో అన్నసమారాధన



తిమ్మరాజుపాలెంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలోని లయన్స్ వృద్ధాశ్రమం, రోటరీ వృద్ధాశ్రమాల్లో మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ 56వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మానవత ప్రతినిధులు తన్నీడి బోసు, ఏవీ రమణ, ఎస్కే హైదర్‌బాషా, ముళ్లపూడి సోమరాజు, కాజ గంగరాజు, ఏరీస్ కంపెనీ మేనేజర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంగారత్నం మృతికి సంతాపం



చాగల్లులో నివాళి అర్పిస్తున్న కూటమి నాయకులు

చాగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చాగల్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ తల్లి గంగారత్నం ఇటీవల మృతి చెందారు. ఈసందర్భంగా కూటమి నాయకులు పలువురు గురువారం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివ నాగేంద్ర, నాయకులు బొడ్డు కేశవకుమార్, దండమూడి రమేష్, కోడూరి శ్రీనివాసరావు, వీరేంద్ర చౌదరి, జొన్నకూటి సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి

● మున్సిపల్ కౌన్సిల్‌లో అధికార, ప్రతిపక్షాలు ఆగ్రహం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి (ఇన్‌సెట్లో) , హాజరైన కౌన్సిలర్లు

కొవ్వూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముందుగా అజెండాలోని అంశాలకు ఆమోదం తెలిపారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ టీటీడీ గోదావరి హారతి నిర్వహణకు సహకరించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, వివిధ ప్రభుత్వశాఖల అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి యూనిఫామ్ ఇవ్వాలని గత కౌన్సిల్‌లో నిర్ణయించామని, ఎంతవరకు వచ్చిందని కమిషనర్‌ను అడిగారు. సంక్రాంతిలోగా వర్కర్లకు యూనిఫామ్ అందించేందుకు చర్యలు తీసుకుంటామనారు. అనంతరం బొండాడ సత్యనారాయణ, చీర అరుణ, వైసీపీ ఫ్లోర్ లీడర్ కోడూరి శివరామకృష్ణ తులసీ వరప్రసాద్ మాట్లాడారు. తర్వాత కంటమణి రమేష్‌బాబు మాట్లాడుతూ 23వ వార్డులో కౌన్సిల్ ఏర్పడిన 2వ సమావేశంలో 2 పనులు పెట్టామని 4 సంవత్సరాలు పూర్తయినా.. ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. పనులు చేపట్టని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ కౌన్సిల్ అధికారులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, పనులు చేపట్టడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ నాకు 30 సంవత్సరాల అనుభవం ఉందని, పారిశుధ్యం విషయంలో 24 గంటటగలు పనిచేయాలని, నెలరోజుల్లో పారిశుధ్యం మెరుగుపర్చి చూపిస్తానన్నారు. విద్యుత్ శాఖ ఏఈ డి.జగదీశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ దీపాల నిర్వహణపై మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించామని, అవసరమైతే మరోసారి సంయుక్తంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉన్నవా లేవా అని పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు సమయానికి సరుకులు చేర్చండి



గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏఎస్‌వో ఆంజనేయులు

గోపాలపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి స్టాక్ పాయింట్ నుంచి సమయానికి రేషన్ షాపులకు నిత్యవసర సరుకులు చేర్చాలని ఏఎస్‌వో ఎం.ఆంజనేయులు అన్నారు. స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ నెల ముగింపులోగా డెలివరీ పూర్తి చేయాలని ప్రతీ నెల నిర్థిష్టసమయానికి రేషన్ షాపులకు సక్రమంగా సరుకులు అందజేయాలన్నారు. డీలర్ల అభ్యర్థన మేరకు కచ్చితమైన తూకంతో సరుకులు డీలర్లకు అందజేయాలన్నారు. కార్డుదారులకు నిత్యవసర సరుకుల పంపిణీలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని సూచించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గోపాలపురం, దేవరపల్లి సివిల్ సప్లై డీటీ దివాకర్‌బాబు, సత్యనారాయణ, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి కోనాల సరీనా, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయానికి హుండీ బహూకరణ



హుండీని బహూకరించిన దాత రామకృష్ణ

దేవరపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబా ఆలయానికి గురువారం దేవరపల్లికి చెందిన పిన్నమని రామకృష్ణ కుమారుడు, సత్యప్రసాద్, సత్యనాగిని దంపతులు రూ.50 వేలు విలువ గల స్టీలు హుండీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం సత్యనారా యణ చార్యులు దాతలతో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. హుండీని అందజేసిన దాతను ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చివటంలో 115 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ఉండ్రాజవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా చివటం హైస్కూల్ విద్యార్థులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. హైస్కూల్‌లో 115 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా వారిలో 13 మందికి కళ్లజోళ్లు అవసరం ఉందని గుర్తించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె. ఏడుకొండలు, కె. విజయకుమారి, జ్యోతి, ఆశావర్కర్లు సుజాత, విజయలక్ష్మి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ప్రియదర్శిని ఎంపిక

దేవరపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న మిరియాల ప్రియాంక జాతీయ స్థాయి టెన్నికాయిట్‌కు ఎంపికైనట్టు రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియదర్శిని ఈనెల 21,22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సొండిపూడిలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిందన్నారు. దీంతో ఈనెల 26వ తేదీ కేరళలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో మన రాష్ట్రం తరపున పాల్గొంటుందని తెలి పారు. ప్రియదర్శినిని అభినందించిన వారిలో పీడీ సరస్వతి, టీచర్లు ఉన్నారు. ఈయనతోపాటు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలి : సీఐటీయూ



లేబర్ కోడ్ పత్రాలు తగులబెడుతున్న కార్మికులు

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం హరిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు ఆరోపించారు. గురువారం కోరమండల్ కాంక్రీట్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద యూనియన్ కార్యదర్శి బీర రవి ఆధ్వర్యంలో లేబర్‌కోడ్ పత్రాలను కార్మికులు తగలబెట్టారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. శ్రమ్ శక్తి ఎన్‌ఐటీ 2026 పేరుతో తీసుకువస్తున్న నూతన జాతీయ కార్మిక విధానాన్ని కార్మిక లోకం వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో కోరాడ రామకృష్ణ, బట్టు శాంసంగ్, టి.రాంబాబు, పి.పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల అన్నదానానికి సరుకులు



సరుకులు అందజేస్తున్న శివసాయిధామం సేవా సమితి సభ్యులు

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారుల అన్నదానానికి శివసాయిధామం సేవా సమితి ఆధ్వర్యంలో రూ. 40 వేల విలువైన నిత్యవసరాలను గురువారం పంపిణీ చేశారు. గోష్పాదక్షేత్రంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మాలధారుల అన్నదానం నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ ఇటీవల హిందూ శ్మశానవాటిక ఆవరణలో రెండు శాశ్వత ఫ్రీజర్లు, ఒక మొబైల్ ఫ్రీజరును ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది నివాసం ఉండడానికి నూతన భవన నిర్మాణం చేపట్టామన్నారు. అస్థికలు భద్రపరుచుకోవడానికి లాకర్‌లను ఏర్పాటు చేశామని, కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి ఉపాధ్యక్షుడు పరిమి రాజేష్, రెడ్డి తాతయ్యబాబు, నగళ్లపాటి శ్రీనివాస్, నారా సుబ్రహ్మణ్యేశ్వరరావు, చలపాక గణేష్, అక్షయపాత్ర రవీంద్ర, ర్యాలీ బ్రహ్మానందం, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు నున్నసాయి, ఉప్పులూరి ప్రసాద్, అక్కిన దిలీప్, కంటమణి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ ఆలయంలో పటిక బెల్లంతో తులాభారం



తులాభారంలో పాల్గొన్న భక్తులు, తదితరులు

దేవరపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలదుర్గమ్మ ఆలయాన్ని గురువారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన ఆదిమూలం వీర వెంకట సత్యనారాయణ, వరహాలు దంపతులు కుమారుడు కార్తికేయకు పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేసింది. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు పైడికొండల వెంకటేశ్వరరావు, గారపాటి అప్పారావు, పిన్నమని వెంకటకృష్ణ, కామిశెట్టి మంగా,పైడికొండల శేఖర్, కామిశెట్టి శిరోమణి, తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ వేడుకల్లో కళాకారుల ప్రదర్శన



గిరిజన సంప్రదాయ వేషధారణలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, తదితరులు

నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సంప్రదాయ నృత్య కళాకారులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మార్కెట్ ఏరియా, నంగాలమ్మతల్లి ఆలయం మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ రోటరీ క్లబ్ మీదుగా సాగింది. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణకు సంప్రదాయ కళాకారులు గిరిజన తలపాగాను బహూకరించారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, వైస్ చైర్మన్ వజీరుద్దీన్, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, ఫువ్వల రతీదేవి, ఉసురుమర్తి జాన్‌బాబు, చిలకల శారదాదేవి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమామల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణం



ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పందలపర్రులో వేంచేసి వున్న ఉమామల్లేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. దేవస్థానం చైర్మన్‌గా గొల్లపల్లి మురళీకృష్ణ, మెంబర్లుగా భోగిరెడ్డి సుబ్బారావు, పులిమి సూర్యనారాయణ, శింగనపూడి మందేశ్వరరావు, అయినవిల్లి ఏసు, గోలుకొండ వెంకటలక్ష్మి, తుంటిపాక వెంకటలక్ష్మి, పుల్లేటి కుర్తి కనకదుర్గ, కప్పల సుజాత, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా దేవస్థానం అర్చకులు బాదంపూడి సూర్యనారాయణ మూర్తిచే దేవాదాయ ధర్మాదాయశాఖాధికారులు బి.లక్ష్మీ నరసింహారావు, సోమాల శివ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు శైలజ



శైలజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కాల జడ్పీ హైస్కూల్లో పదోతరగతి చదువుతున్న పాలా శైలజ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. అండర్ -17 బాలికల విభాగం ఎంపిక పోటీల్లో ఆమె ఆమె పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారు. దేవరపల్లిలో జరిగిన ఎంపిక పోటీల్లో ఆమె ఈ పోటీలకు ఎంపికయ్యింది. ఈసందర్భంగా విజేత శైలజను ప్రధానోపాధ్యాయుడు ఎం. నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాధరరావు, పాఠశాల ఉపాధ్యాయురాలు శైలజను అభినందించారు.

గౌరిపల్లి, యాదవోలులో రైతన్న మీకోసం కార్యక్రమాలు



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతన్న మీసం కోసం కార్యక్రమం గౌరిపల్లిలో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఇంటింటా తిరిగి రైతులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం గురించి వారికి వివరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతలకు ధాన్యం ప్రభుత్వమే సకాలంలో కొనుగోలు చేసి 24 గంటల లోపు నగదు వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివ నాగేంద్ర, కూటమి నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, ఉప్పులూరి శ్రీనివాసరావు, తాళ్లూరి రామకృష్ణ రత్నాజీ, పత్తిపాటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా గౌరీపల్లిలో నూతనంగా నిర్మాణం చేయనున్న రామాలయానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు.

దేవరపల్లి: యాదవోలులో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం వ్యవసాయ శాఖాధికారి కే.కమలరాజు ఆధ్వర్యంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.నాగవరప్రసాద్, టీడీపీ నాయకులు నుదురుమాటి శ్రీనివాస్, యర్రగుల్ల అంజిబాబు, ఏఎంసీ డైరెక్టర్ మద్దిపాటి చంద్రగణేశ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

నల్లజర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని నల్లజర్ల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. గురువారం నల్లజర్ల హైస్కూల్లో బాల వివాహ ముక్తభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లిళ్ల చేసుకోవడం ద్వారా అనేక అనారోగ్య ఇబ్బందులతోపాటు శిశువుకు ప్రాణపాయం కలిగే ప్రమాదం ఉందన్నారు. శారీరిక దేహదారుఢ్యం లేకపోవడం వల్ల తల్లికి అస్వస్థత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హారతి, కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతివల్లి, శివకుమారి, ప్రేమావతి, శ్రీదేవి, పద్మావతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో పమ్మి దీపిక

పెరవలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో ఖండవల్లికి చెందిన పమ్మి దీపిక పాల్గొంది. రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది విద్యార్థులను ఎంపిక చేసి అమరావతిలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడిగా నియామకం

పెరవలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడిగా తీపర్రుకు చెందిన సింహాద్రి వీర వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కిసాన్ మోర్చ అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి తనను నియమిస్తూ ఉత్తర్వులు పంపినట్టు సింహాద్రి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఆయనకు ఈ పదవి రావడం పట్ల నియోకజవర్గంలోని పలువురు బీజేపీ నాయకులు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

తాడిపర్రులో విగ్రహాల ప్రతిష్ఠ

ఉండ్రాజవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో పార్వతీ సమేత సోమేశ్వరస్వామివారి ఆలయం వద్ద నూతనంగా విఘ్నేశ్వరస్వామి, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహాలు, కాలభైరవస్వామి, సూర్యభగవాను స్వామివార్ల విగ్రహాలను గురువారం వేదమంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా ప్రతిష్ఠించారు. తొలుత విగ్రహాలకు హోమాలు, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్యే జీ. శ్రీనివాసనాయుడు స్వామివార్లను దర్శించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతర అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దేవరపల్లికి చేరుకున్న లక్ష్మీరమణి పాదయాత్ర



దేవరపల్లిలో పాదయాత్ర చేస్తున్న లక్ష్మీరమణి

దేవరపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండల మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నాయకురాలు ఎం.లక్ష్మీరమణి ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం నుంచి సింహాచలం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం దేవరపల్లి చేరుకుంది. లక్ష్మీ రమణికి శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాద యాత్ర చేస్తున్న లక్ష్మీరమణికి టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు, టీడీపీ నాయకులు కరుటూరి ధనుంజయ, ముళ్లపూడి దొరాజీ చౌదరి, కాట్రు భీమరాజు, బళ్లా సూర్యచక్రం, రమాదేవి, బలుసు సత్యనారాయణ, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మనిషి విలువను పెంచేది ఒక్క విద్యే



చిట్యాలలో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసిన దృశ్యం

గోపాలపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మనిషి విలువను పెంచేది ఒక్క విద్యేనని చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షుడు గద్దే హరిబాబు అన్నారు. చిట్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సొసైటీ నిధులు రూ. 10,500 సమకూర్చిన హాట్‌బాక్సులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగించి గుర్తింపు లభించేది విద్యతో మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పగడాల నరసింహమూర్తి, గర్సికూటి సత్యనారాయణ, కూటమి నాయకులు రత్నాజీచౌదరి, ఉండవల్లి గంగాధర శ్రీనివాసరావు, కాండ్రేగుల శ్రీహరి, గర్సికూటి మునేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ ఆధారంగా రాష్ట్రంలో బీజేపీని పటిష్టం చేయడంతోపాటు కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో జరిగిన బీజేపీ గోదావరి జోన్ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ వర్గ్‌లో ఆయన మాట్లాడుతూ కలిసి పనిచేయడానికి ఈ శిక్షణ తరగతులు ప్రేరణగా నిలుస్తాయన్నారు. మండల నాయకులు పార్టీ తరఫున క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ప్రశిక్షణ వర్గ్ నిర్వహించుకోవడం ద్వారా నాయకుల్లో నిబద్ధత, నాయకత్వం పెరుగుతోందన్నారు. జాతీయ పార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేస్తున్నామనే సంగతి తెలుసుకోవాలని సూచించారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు వేటుకూరి సూర్యనారాయణ రాజు, బొమ్ముల దత్తు, నిర్మలా కిషోర్, లక్ష్మీప్రసన్న, మధుకర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే గోదావరి నదీ తీరాన కొంతసేపు యోగా చేశారు.